thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 129| జగిత్యాల | మంగళవారం 11 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

మీ గెలుపు దేశానికే గర్వకారణం



11



# వానలు కురవాలని వరుణుడికి మహాయాగం

- నాగార్జునసాగర్ తీరాన మహా వరుణ యాగం
- సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- 11 హోమగుండాలు.. 108 మంది రుత్వికులతో వైదిక క్రతువు
- పూర్ణాహుతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు
- జలాశయాలు నిండాలి.. పంటలు పండాలంటూ సంకల్పం

2

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, జలాశయాలు నిండి రైతు సంక్షేమం వర్ధిల్లాలనే ఆకాంక్షతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'మహా వరుణ యాగం' సోమవారం వైభవంగా ముగిసింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పవిత్ర వైదిక క్రతువు పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి తన సతీమణితో కలిసి పాల్గొన్నారు.



ప్రతి పేద కుటుంబానికీ సొంతింటి కల నెరవేరుస్తాం

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పాల్గొని సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంతకుముందు గూడూరు గ్రామంలోని గృహాలను పరిశీలించిన మంత్రులు, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను పేదల ఇంటింటికీ అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, పేద పిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయంతో పాటు విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దశల్లో నిలిచిపోయిన 35 వేల అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ గృహనిర్మాణ పథకంలో భాగంగా మొదటి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నామని, తర్వాతి విడతల్లోనూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

*- హనుమకొండ, ఆగస్టు 10*

2

## క్లీన్ ఎనర్జీ గ్లోబల్ హబ్‌గా తెలంగాణ



- కాలిఫోర్నియా అనుభవాలతో రాష్ట్రంలో ఇంధన విప్లవం
- అమెరికా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

# డిఫెన్స్ కారిడార్‌కు ఆమోదమివ్వండి

### కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జితేందర్‌రెడ్డి విజ్ఞప్తి

- యూపీ, తమిళనాడు తరహాలో రక్షణ--ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని వినతి
- హైదరాబాద్‌లో 1,500కు పైగా రక్షణ, ఏరోస్పేస్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు
- ప్రతిపాదనను పరిశీలిస్తామని రాజ్‌నాథ్‌సింగ్ హామీ

హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా అధికారికంగా గుర్తించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఏ.పి. జితేందర్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. న్యూఢిల్లీలోని రక్షణ మంత్రి అధికారిక నివాసంలో ఖమ్మం ఎంపీ ఆర్. రఘురామ్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌లతో కలిసి ఆయన సోమవారం భేటీ అయ్యారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న రక్షణ కారిడార్ల తరహాలోనే తెలంగాణకు కూడా డిఫెన్స్ కారిడార్ కేటాయించాలని గతంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తిని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు.

- న్యూఢిల్లీ, ఆగస్టు 10

.. వివరాలు 2లో





## తెలంగాణలో ముగిసిన 'సర్' ప్రక్రియ

73.95 లక్షల ఓట్లు తొలగించినట్లు సమాచారం

2

## ట్రైబ్యునళ్ల సంస్కరణలకు లోక్‌సభ పచ్చజెండా

- విపక్షాల ఆందోళనల మధ్య బిల్లుకు ఆమోదం

4



## పోలవరం తొలిదశకు కేంద్రం ఆమోదం

సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు

4




## అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

- అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు
- హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ

4

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది

- ప్రజల అభిమానం చూరగొన్న నేత
- నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటీఆర్ వెల్లడి

3





3

## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

సాగునీటి సమస్యను తీర్చండి

మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ



## ఇంటింటా త్రివర్ణం రెపరెపలాడాలి

- 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనండి
- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- వికసిత భారత్ సంకల్పాన్ని చాటుదామన్న ప్రధాని
- క్విట్ ఇండియా ఉద్యమ వీరుల త్యాగాలకు నివాళి

4



# ముగిసిన 'సర్' ప్రక్రియ

**73.95 లక్షల ఓట్లు తొలగించినట్లు సమాచారం**

**2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి**

**రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం నమోదు**

**హైదరాబాద్, ఆగస్టు 10:** తెలంగాణలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది. ఈ ప్రక్రియలో 73,95,954 మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 78.14 శాతంగా నమోదైంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే యాదాద్రి భువనగిరి జిల్లా 94.30 శాతం డిజిటలైజేషన్‌తో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. మెదక్ జిల్లాలో 90.54 శాతం, సూర్యాపేటలో 90.43 శాతం ప్రక్రియ పూర్తయింది. జగిత్యాలలో 89.60 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. మరోవైపు హైదరాబాద్ జిల్లా డిజిటలైజేషన్‌లో రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం నమోదైంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు రెండుసార్లు గడువు పొడిగించినప్పటికీ ఆశించిన స్థాయిలో డిజిటలైజేషన్ పెరగకపోవడం గమనార్హం. 'సర్' ప్రక్రియ పూర్తయిన విషయాన్ని ఈ నెల 12న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ముసాయిదా జాబితాపై నెల రోజులపాటు అభ్యంతరాలు, దరఖాస్తులను స్వీకరించనున్నారు. వాటి పరిశీలన, పరిష్కారం అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు సమాచారం.

# క్లీన్ ఎనర్జీ గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

**పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యం**

**2030 నాటికి దేశంలో 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం**

**గ్రిడ్ ఆధునీకరణ.. బ్యాటరీ నిల్వ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి**

**కాలిఫోర్నియా అనుభవాలతో రాష్ట్రంలో ఇంధన విప్లవం**

**అమెరికా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్' ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.



# వానలు కురవాలని.. వరుణుడికి మహాయాగం

- నాగార్జునసాగర్ తీరాన యాగం
- సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- 11 హోమగుండాలు.. 108 మంది రుత్విక్కులతో వైదిక క్రతువు
- పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం దంపతులు
- జలాశయాలు నిండాలి.. పంటలు పండాలంటూ సంకల్పం



**నాగార్జునసాగర్, ఆగస్టు 10:** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలి.. కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలి.. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవాలి.. పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడాలి.. అన్నదాతల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం సోమవారం మహా వరుణ యాగాన్ని నిర్వహించింది. నాగార్జునసాగర్ సమీపంలోని కృష్ణా నదీ తీరాన విజయ విహార్ వేదికగా వేద మంత్రోచ్ఛారణల మధ్య ఈ క్రతువు శాస్త్రోక్తంగా సాగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాల పరిస్థితులు, వర్షపాతం తగ్గడం, జలాశయాల్లో నీటిమట్టాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం నేపథ్యంలో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలన్న ఆకాంక్షతో ప్రభుత్వం వరుణ యాగానికి శ్రీకారం చుట్టింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు కూడా యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**11 హోమగుండాలు.. 108 మంది రుత్విక్కులు**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, రుత్విక్కుల ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహించారు. ఇందుకోసం విజయ విహార్ ప్రాంగణంలో ప్రత్యేకంగా 11 హోమగుండాలను ఏర్పాటు చేశారు. 108 మంది రుత్విక్కులు, వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య హోమాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఉదయం నుంచి యాగ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

**సాగర్‌లో తగ్గిన జలమట్టం**

నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 145.65 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం సుమారు 518 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతున్నట్లు తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో జలాశయంలో నీటి నిల్వలు మెరుగ్గా ఉన్నాయని పేర్కొన్నారు.

**పల్లెలు పచ్చగా కళకళలాడాలని..**

వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు జీవజలాలతో ప్రవహించాలని, ప్రాజెక్టులు, చెరువులు నిండాలని, సాగునీటికి కొరత లేకుండా రైతులు సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో మహా వరుణ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, కొండా సురేఖతోపాటు ప్రభుత్వ సలహాదారులు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తాం
- దశలవారీగా లబ్ధిదారులకు ఇండ్లు కేటాయిస్తాం
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం
- తొలి విడతలో 4.5 లక్షలు.. రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లు
- కులం, మతం, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- కమలాపూర్‌లో సుమారు 394 ఇళ్ల అందజేత



**హనుమకొండ, ఆగస్టు 10:** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా దశలవారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలను పేదల గడప వద్దకు తీసుకెళ్తున్నామని తెలిపారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొని సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. పేదవాడికి సొంతిల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అందుకే ఇల్లు లేని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద తొలి విడతలో 4.5 లక్షల ఇళ్లను, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్ల మంజూరు కొనసాగుతుందని చెప్పారు. అర్హత ఉన్న ఏ ఒక్క పేద కుటుంబాన్నీ విస్మరించబోమని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో నిర్మాణాలు ప్రారంభించి అసంపూర్తిగా మిగిలిపోయిన సుమారు 35 వేల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. నిర్మాణ పురోగతిని బట్టి విడతలవారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కులం, మతం, రాజకీయ పార్టీ అనే తేడా ఉండదని పొంగులేటి స్పష్టం చేశారు. అర్హత ఒక్కటే ప్రామాణికమని, రాజకీయ వివక్షకు ఎలాంటి అవకాశం లేదన్నారు. ఇళ్లు నిర్మించి ఇవ్వడంతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదని, లబ్ధిదారుల కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తామని చెప్పారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీతో పాటు పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార, సౌందర్య సాధనాల చార్జీలను కూడా ప్రభుత్వం పెంచిందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. "ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇళ్లు. పేదల ముఖాల్లో ఆనందం చూడటమే మా లక్ష్యం. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా సొంతింటిని అందిస్తాం" అని పొంగులేటి స్పష్టం చేశారు. అంతకుముందు గూడూరు గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రులు పరిశీలించారు. లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌కు ఆమోదమివ్వండి

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జితేందర్‌రెడ్డి విజ్ఞప్తి
- యూపీ, తమిళనాడు తరహాలో రక్షణ-ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని వినతి
- హైదరాబాద్‌లో 1,500కు పైగా రక్షణ, ఏరోస్పేస్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు
- ప్రతిపాదనను పరిశీలిస్తామని రాజ్‌నాథ్ హామీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను కేంద్ర ప్రభుత్వ రక్షణ, ఏరోస్పేస్ కారిడార్‌గా అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడులో ఇప్పటికే ఏర్పాటు చేసిన డిఫెన్స్ కారిడార్ల తరహాలో హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌కు కూడా గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలోని అధికారిక నివాసంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సోమవారం జితేందర్‌రెడ్డి కలిశారు. ఆయన వెంట ఖమ్మం ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో కేంద్రానికి చేసిన విజ్ఞప్తిని జితేందర్‌రెడ్డి మరోసారి రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు.

**రక్షణ రంగానికి హైదరాబాద్ కీలకం**

దేశంలోనే అతిపెద్ద రక్షణ, ఏరోస్పేస్ కేంద్రాల్లో హైదరాబాద్ ఒకటని జితేందర్‌రెడ్డి వివరించారు. నగరంలో డజనుకు పైగా ప్రధాన రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, వ్యూహాత్మక రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు 1,500కు పైగా ఏరోస్పేస్, రక్షణ రంగ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని వివరించారు. తెలంగాణలో రక్షణ, ఏరోస్పేస్ రంగ ఎగుమతులు 2025-26లో వందశాతం వృద్ధిని నమోదు చేశాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేంద్రం అధికారిక గుర్తింపు కల్పిస్తే ఈ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రతిపాదిత కారిడార్‌తో దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని జితేందర్‌రెడ్డి తెలిపారు. పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావడంతో పాటు అత్యాధునిక మౌలిక వసతుల కల్పన, పరిశ్రమల సామర్థ్య విస్తరణకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కొత్త పెట్టుబడులు రావడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయని వివరించారు. దేశ రక్షణ సన్నద్ధతను మరింత బలోపేతం చేయడంతో పాటు స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీకి ఈ కారిడార్ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాల సాధనకు కూడా హైదరాబాద్-బెంగళూరు కారిడార్ గణనీయంగా దోహదపడుతుందని వివరించారు. తెలంగాణకు ఇప్పటికే ఉన్న రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమల అనుకూల వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని జితేందర్‌రెడ్డి కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు జితేందర్‌రెడ్డి తెలిపారు.



# స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం

**సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, ఆగస్ట్ 10:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గొప్ప ముందడుగని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేక పోయారని, ఇప్పుడు కొత్త కార్డులు ఇవ్వడంతో పాటు, స్మార్ట్ కార్డులు కూడా ఇవ్వబోతున్నామని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్



పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

- ప్రజల అభిమానం చూరగొన్న నేత
- నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటీఆర్ వెల్లడి

**నర్సంపేట, ఆగస్ట్ 10:** ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తే తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో



పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే గా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.

### పెద్ది విగ్రహావిష్కరణను అడ్డుకున్న పోలీసులు

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రాహవిష్కరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేటలో విగ్రహాన్ని ఏర్పాటుగా చేయగా అక్కడకు చేరుకున్న పోలీసులు విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారు. ప్రైవేట్ భూమిలో విగ్రహం ఏర్పాటు చేసుకుంటే మీకేంటని బీఆర్ఎస్ నాయకులు ప్రతిఘటించారు.

# అన్ని కులాలకు సమాన అవకాశాలే లక్ష్యం

- బీసీల హక్కుల పోరాటం ఎవరికీ వ్యతిరేకం కాదు
- రాజకీయాలకు అతీతంగా సామాజిక న్యాయం కోసం పనిచేయాలి
- స్వశక్తితో రాజుగా ఎదిగిన వీరుడు సర్వాయి పాపన్న
- సచివాలయం ఎదుట మహనీయుల విగ్రహాల ఏర్పాటు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** తెలంగాణలో బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ, చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజయ్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్



తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ గాంధీ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహేష్ కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.



# తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

### రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి

### మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

# హాస్టల్‌లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

### కామారెడ్డికి చెందిన విద్యార్థి పరిస్థితి విషమం

**మేడ్చల్, ఆగస్ట్ 10:** మేడ్చల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌లో దారుణం ఘటన వెలుగులోకి వచ్చింది. పదోతరగతి విద్యార్థిపై సహచర విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. కామారెడ్డికి చెందిన విద్యార్థి అభిషేక్ రెడ్డిపై 8 నుంచి 10 మంది దాడి చేసినట్లు సమాచారం. కర్రలు, భోజనం ప్లేట్లతో కొట్టి.. బూట్లతో అభిషేక్ రెడ్డి ముఖంపై విద్యార్థులు తొక్కినట్లు తెలుస్తోంది. ఈ దాడి ధాటికి మెట్లపై నుంచి బాధితుడు కింద పడిపోయాడు. ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం సమాచారం అందజేశారు. అభిషేక్ రెడ్డిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

# ట్రైనీ ఐపీఎస్ కేసును సిబిసిఐడికి బదిలీ చేయాలి

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసును సీబీసీఐడీకి బదిలీ చేయాలని సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు ఈ-మెయిల్ పంపారు.. ఈ కేసును సీబీసీఐడీ లేదా మరో స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్టుపై పలు ప్రశ్నలను నాగేశ్వరరావు లేవనెత్తారు. పోష్ చట్టం కింద అంతర్గత విచారణ పూర్తికాకముందే ఉదయ్ కృష్ణారెడ్డిని ఎందుకు అరెస్టు చేశారని నాగేశ్వరరావు ప్రశ్నించారు. అతడిని అరెస్టు చేసే సమయంలో దర్యాప్తునకు సహకరించాడా?, సాక్షులను ప్రభావితం చేస్తాడా?, పరారయ్యే అవకాశముందా? వంటి అంశాలను పరిశీలించారా? అని నిలదీశారు. తొలుత బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుల్లో అత్యాచారం, హత్యాయత్నం ఆరోపణలు లేవని ప్రస్తావించారు. కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో తీవ్ర ఆరోపణలు చేర్చారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్వయంగా ఉదయ్ కృష్ణారెడ్డిని విచారించారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తుపై తలెత్తిన అనుమానాలకు స్వతంత్ర విచారణతోనే తెరపడుతుందని డీజీపీకి సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# వరుణ యాగం చేస్తే.. మేం వాయు యాగం చేస్తాం

- కాంగ్రెస్ కొట్టుకుపోవాలంటూ యాగం చేస్తాం
- వానాకాలం చివర్లో ఇదేం కొత్త నాటకం?
- ఎల్‌నినో విషయం ముఖ్యమంత్రికి తెలియదా?
- హైడ్రా కమిషనర్ మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్నారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ధ్వజం

**హైదరాబాద్, ఆగస్టు 10:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్షాల కోసం వరుణ యాగం చేస్తే.. రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోవాలని తాము 'వాయు యాగం' చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వానాకాలం చివరి దశకు వచ్చిన తర్వాత వరుణ యాగం పేరుతో ప్రభుత్వం కొత్త నాటకానికి తెరతీసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఉన్న విషయం ముఖ్యమంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. సోమవారం మీడియాతో చిట్‌చాట్‌లో రాంచందర్‌రావు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులపై ముందుగానే కార్యాచరణ



చేపట్టాల్సిన ప్రభుత్వం ఇప్పుడు యాగాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో వారికి అవసరమైన సహాయం అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. వరుణ యాగంతో వర్షాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తే.. కాంగ్రెస్ కొట్టుకుపోవాలని తాము వాయు యాగం చేస్తామని ఎద్దేవా చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పైనా రాంచందర్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. హైకోర్టు చెప్పినా ఆయన తీరు మారడం లేదని, మజ్లిస్‌పై ఉన్న ప్రేమ ప్రజలపై లేదని ఆరోపించారు. నాదర్‌గుల్‌లో ఎకరాలకొద్దీ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వేల ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడామని చెబుతున్న హైడ్రా.. వాటి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సల్కం చెరువులో అక్రమ నిర్మాణాల విషయంలోనూ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా చూస్తూ ఊరుకునేది లేదని రాంచందర్‌రావు హెచ్చరించారు. క్యూర్ అంశంపై ఆగస్టు 15 తర్వాత బీజేపీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి, అనంతరం ఉద్యమాలను ఉధృతం చేస్తామని చెప్పారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇదిలావుండగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా రాంచందర్‌రావు తన నివాసంపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 14న ట్యాంక్‌బండ్‌పై భారీ తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఈ యాత్రలో పాల్గొని దేశ ఐక్యతను చాటాలని కోరారు.

## సంపాదకీయం




# జార్ఖండ్ ఆందోళనపై దృష్టి సారించాలి!

### పరీక్ష ఏదైనా.. లీకేజీ మాత్రం షరామామూలేనా?

**కష్టపడేది విద్యార్థులు.. భవిష్యత్తుతో ఆడుకునేది అక్రమార్కులు**

**సీబీఐ విచారణ కోరుతున్న అభ్యర్థులు.. కొనసాగుతున్న ఆందోళన**

**దోషులు ఊచలు లెక్కిస్తేనే పేపర్ లీకులకు అడ్డుకట్ట**

పరీక్ష ఏదైనా లీకులు సర్వ సాధారణం అవుతున్నాయి. పరీక్షలు రాసిన విద్యార్థులు నష్టపోతున్నారు. ఏడాదంతా కష్టపడి పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటోంది. కొందరు దగుల్బాజీలు కాసులకు కక్కుర్తి పడడంతో ఉజ్వల జీవితాన్ని విద్యార్థులు కోల్పోతున్నారు. మొన్నటి వరకు నీట్ గొడవ ముగిసిం దనుకుంటే.. ఇప్పుడు జార్ఖండ గొడవ మొదలయ్యింది. ఇక్కడ ఉన్నది ఇండియా కూటమి ప్రభుత్వమే. సిఎం హేమంత్ సోరేన్ ప్రభుత్వం కూడా ఇందుకు బాధ్యత వహించాలి. అలాగే రాహుల్ కూడా దీనిపై సమాధానం చెప్పాలి. కేంద్రంలో హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని అంటున్న రాహుల్ ముందు జార్ఖం÷–డ్ వెళ్లి అక్కడి విద్యార్థులకు సమాధానం చెబితే బాగుండేది. పరీక్షలు ఏవైనా, ఎక్కడ లీకైనా పాలకులు బాధ్యత వహించాల్సిందే. కేంద్రంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనీమా చేసిన తరవాత, పరీక్షల సంస్కరణలకు ఎన్డిఎ సర్కార్ నడుం బిగించింది. నందన్ నీలేకన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని వేసింది. లీకేజ్ వీరులపై చర్యలు తీసుకునేలా చట్టం తెచ్చింది. పదికోట్ల వరకు జరిమానా, పదేళ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. ఇప్పుడు దీనిని ఉపయోగించి జార్ఖండ్ దోషులపై తొలి చర్యకు ఉపక్రమించాలి. ఇందుకోసం రాహుల్ కూడా పట్టుబట్టాలి. కేవలం అమిత్ షా రాజీనామా చేయాలన్న రాజకీయ డిమాండ్‌తో పార్లమెంట్‌ను అడ్డుకుంటూ విలువైన ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. పార్లమెంట్ నడవకుండా చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రం చర్యలు తీసుకున్నందున, ఇక జార్ఖండ్‌పై రాహుల్ దృష్టిసారిస్తే మంచిది.మరోవైపు జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర సిఐడి నమోదు చేసిన కేసు ఆధారంగా గత వారం ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ప్రభుత్వం నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిఐడి, ఇడి దర్యాప్తులకు అంగీకరించింది. విద్యార్థులతో జరిగిన సమావేశం అనంతరం మంత్రి సుదివ్య కుమార్ సోను మాట్లాడుతూ.. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లలో దాదాపు 98 శాతం అంశాలను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. 2023, 2025 సంవత్సరాలకు సంబంధించిన బ్యాక్‌లాగ్ నియామక పరీక్షలతో పాటు 14వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను రద్దు చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. అయితే సర్వీస్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షను రద్దు చేయడం, అలాగే నియామక పరీక్షల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదు. మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకారం.. సిజిఎల్ పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏకపక్షంగా అంగీకరించలేదని తెలిపారు. ఈ పరీక్ష హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల పరిధిలో నిర్వహించబడినందున, ప్రభుత్వం స్వయంగా దానిని రద్దు చేయలేదని వివరించారు. అయితే ప్రభుత్వం తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించిందన్న వాదనను నిరసన చేస్తున్న విద్యార్థులు తిరస్కరించారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రతిపాదనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం 'విధానసభ ఘెరావ్' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తమ ప్రధాన డిమాండ్ అయిన సిబిఐ దర్యాప్తును ప్రభుత్వం అంగీకరించలేదని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్ల లో 98 శాతం నెరవేర్చామని ప్రభుత్వం చెప్పడం వాస్తవానికి విరుద్ధమని వారు ఆరోపించారు. 13 పరీక్షలను రద్దు చేయాలని తాము డిమాండ్ చేయగా, ప్రభుత్వం కేవలం మూడు పరీక్షలను మాత్రమే రద్దు చేసిందని ఓ విద్యార్థి నాయకుడు పేర్కొన్నారు. అవకతవకలపై కేవలం సిఐడి దర్యాప్తుపైనే ఆధారపడటాన్ని కూడా విద్యార్థి నాయకులు విమర్శించారు. గతంలో సిఐఇడిపై పలు విషయాల్లో 'కప్పిపుచ్చే ప్రయత్నాలు' చేసిందనే ఆరోపణలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. నియామక పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై నిజాలను వెలుగులోకి తీసుకురావడానికి, బాధ్యులను గుర్తించడానికి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ అవసరమని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను శాంతి యుతంగా వివరించాలని విద్యార్థి నాయకులు సూచించారు.సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఇడి రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రభుత్వం ఇడి, సిఐడి దర్యాప్తులకు అంగీకరించగా, మరోవైపు విద్యార్థులు మాత్రం సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు కోరుతూ తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అవకతవకు కారకులైన వారిని ఊచలు లెక్క బెట్టేలా చేయాలి. అప్పుడే వారికి న్యాయం జరుగతుంది. అలాగే ఇతరులకు తగిన గుణపాఠం కలిగేలా కొత్త చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలి.

# ఇంటింటా త్రివర్ణం రెపరెపలాడాలి

- 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనండి
- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- వికసిత భారత్ సంకల్పాన్ని చాటుదామన్న ప్రధాని
- క్విట్ ఇండియా ఉద్యమ వీరుల త్యాగాలకు నివాళి



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** జాతీయ పతాకం ప్రతి భారతీయుడికీ గర్వకారణమని, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో దేశ ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని ఆకాంక్షించారు. జాతీయ పతాకం దేశ ప్రజలకు నిరంతర ప్రేరణశక్తిగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోట్లాది మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసేలా 2022 నుంచి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈసారి కూడా ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి 'వికసిత భారత్' సాధనకు ఉమ్మడి సంకల్పాన్ని చాటాలని కోరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుల ధైర్యసాహసాలను ఈ సందర్భంగా ప్రధాని స్మరించుకున్నారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నాయకత్వంలో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణ ఇచ్చిందన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారి త్యాగాలు, ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వందేమాతరం గీతం ఆలాపనపై కేరళలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో అనుసరించిన విధంగానే గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపిస్తామని అక్కడి కొందరు నేతలు పేర్కొన్నారు.




## కేంద్ర మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

**అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు**

**హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10:** పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' అని అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.

## ట్రైబ్యునళ్ల సంస్కరణలకు లోక్‌సభ పచ్చజెండా

**విపక్షాల ఆందోళనల మధ్య బిల్లుకు ఆమోదం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** విపక్షాల ఆందోళనల నడుమ కీలకమైన ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సభలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల మధ్య బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం లోక్‌సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు. దేశంలోని వివిధ ట్రైబ్యునళ్ల పనితీరును మరింత సమర్థంగా మార్చడంతోపాటు వాటి సారథులు, సభ్యుల నియామక ప్రక్రియలో పారదర్శకత, ఏకరూపత తీసుకురావడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. ట్రైబ్యునళ్లలో నియామకాలు, సభ్యుల అర్హతలు తదితర అంశాలకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. బిల్లులో ప్రధానంగా జాతీయ ట్రైబ్యునల్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను పొందుపరిచారు. ఒక ఛైర్‌పర్సన్‌తోపాటు నలుగురు సభ్యులతో కమిషన్ ఏర్పాటవుతుంది. సభ్యుల్లో ఇద్దరు న్యాయ రంగం నుంచి, మరో ఇద్దరు సాంకేతిక రంగం నుంచి ఉంటారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లేదా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తిని కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమించేలా ప్రతిపాదించారు. ట్రైబ్యునళ్ల నిర్వహణ, నియామక ప్రక్రియను మరింత వ్యవస్థీకృతం చేయడంతోపాటు వాటి స్వతంత్రత, సమర్థతను పెంచడం కమిషన్ ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. ట్రైబ్యునళ్లలో నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, దేశవ్యాప్తంగా ఒకే విధమైన వ్యవస్థను తీసుకురావడంలో ఈ సంస్కరణలు కీలకంగా మారనున్నాయి.

## పోలవరం తొలిదశకు కేంద్రం ఆమోదం

**సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు**

న్యూఢిల్లీ, ఆగస్ట్ 10: పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. తొలి దశలో 41.15 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపింది. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,620.53 కోట్ల నిధులు విడుదల చేసిందని పేర్కొంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.5,512.40 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఈ సందర్భంగా స్పిల్‌వే నిర్మాణంలో ఇప్పటివరకు 96.87 శాతం మట్టి పనులు పూర్తయ్యాయని కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. కాంక్రీట్ పనులు 98.84 శాతం, స్టీల్ పనులు 92.9 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించింది. అలాగే ఎర్త్–కమ్–రాక్‌ఫిల్ డ్యామ్‌కు సంబంధించి కాంక్రీట్ పనులు 81.99 శాతం పూర్తయ్యాయని పేర్కొంది. ప్రధాన కాలువల తవ్వకం పనులు 98.96 శాతం పూర్తయ్యాయని వివరించింది. ప్రాజెక్టు తొలి దశలో మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. పోలవరం తొలి దశలో నిర్వాసిత కుటుంబాల పునరావాసం, పునరావాస ప్యాకేజీల అమలుపైనా కేంద్రం వివరాలు వెల్లడించింది. ఇప్పటివరకు 17,892 నిర్వాసిత కుటుంబాలను తరలించినట్లు తెలిపింది. ర్అండ్ఆర్ పరిహారం కింద రూ.1,373.01 కోట్లు పంపిణీ చేసినట్లు కేంద్రం పేర్కొంది. పునరావాసం, పునరావాస పనులకు అదనంగా రూ.1,581.08 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు తొలి దశను మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం తెలిపింది. అవసరమైతే మరో ఏడాది గడువు పొడిగించే వెసులుబాటు కూడా ఉందని స్పష్టం చేసింది.

# విద్యార్థుల ఆందోళనలపై చర్చకు సిద్ధం

- పోలీసు చర్యలపైనా పార్లమెంట్‌లో సమగ్రంగా చర్చిద్దాం
- విపక్షాలు సభను అడ్డుకోవద్దు: కిరణ్ రిజిజు
- హోంమంత్రి సమాధానం వినాలని సూచన
- అమిత్ షా వివరణకు విపక్షాల పట్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, ఆ సందర్భంగా చోటుచేసుకున్న పోలీసు చర్యలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. విద్యార్థుల ఉద్యమానికి సంబంధించిన ప్రతి అంశంపైనా పూర్తి స్థాయిలో చర్చించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సోమవారం వెల్లడించారు. అయితే చర్చ పేరుతో సభా కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని విపక్షాలకు సూచించారు. "విద్యార్థుల ఉద్యమం, దానికి సంబంధించిన పరిణామాలపై పూర్తి స్థాయి, సవివరమైన చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. చర్చ జరుగుతున్న సమయంలో హోంమంత్రి లేదా ప్రభుత్వం సమాధానం ఇస్తుంటే విపక్షాలు అంతరాయం కలిగించకూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని వినాలి" అని రిజిజు పేర్కొన్నారు.



**అమిత్ షా వివరణకు విపక్షాల పట్టు**

విద్యార్థుల ఆందోళనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్స్ వినియోగించారన్న ఆరోపణలతోపాటు బిహార్‌లోని సివాన్‌లో ఏకే–47 వినియోగంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వివరణ ఇవ్వాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ రిజిజు చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓ జాతీయ పత్రికలో రాసిన వ్యాసంలో విద్యార్థులపై పోలీసు చర్యలను తీవ్రంగా విమర్శించారు. ఘటనలపై హోంమంత్రి ఇప్పటివరకు విచారణకు ఆదేశించలేదని, కనీసం ప్రకటన కూడా చేయలేదని ఆరోపించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని విపక్షాలు నోటీసులు ఇస్తున్నప్పటికీ వాటిని తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు.

**పోలీసు చర్యలపై రాహుల్ ఆరోపణలు**

విద్యార్థుల ఆందోళనలను అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు పాల్పడిందని రాహుల్ ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగించడంతోపాటు మేకులు అమర్చిన లాఠీలు, పెల్లెట్ గన్స్ ఉపయోగించారని పేర్కొన్నారు. బిహార్‌లోని సివాన్‌లో ఏకే–47 వినియోగించారన్న అంశంపైనా ప్రశ్నలు లేవనెత్తారు. నీట్ పరీక్షలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనల విషయంలో ప్రభుత్వం పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఉద్యమం, పోలీసు చర్యలపై చర్చకు సిద్ధమంటూ కేంద్రం ప్రకటించడంతో పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడి చర్చ జరిగే అవకాశముంది.

చురకలు



# గద్దె కూల్చారు... ఉద్యమాన్ని రగిలించారు!

- పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ గద్దె కూల్చివేతపై బీఆర్ఎస్ ఆగ్రహం
- రెండు రోజుల్లో బాధ్యులపై చర్యలు లేకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
- ఎర్రబెల్లి దయాకర్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్



**నర్సంపేట, ఆగస్టు 10 ::** దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను మున్సిపల్ అధికారులు కూల్చివేయడంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నల్ల బ్యాడ్జీల నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.అంతకుముందు విగ్రహ ఆవిష్కరణ కోసం ఏర్పాటు చేసిన గద్దెను కూల్చివేసిన ప్రదేశాన్ని వారు సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సేవ చేసిన దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మించిన గద్దెను ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేయడం దారుణమన్నారు. విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు.ఈ వ్యవహారం వెనుక కాంగ్రెస్ నాయకుల కుట్ర ఉందని వారు ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టం చేశారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణం విషయంలోనూ తమకు అనుమానాలు కలుగుతున్నాయని వారు వ్యాఖ్యానించారు. ఆయనను మానసికంగా ఎంతగా ఇబ్బందులకు గురిచేశారో ఈ పరిణామాల ద్వారా అర్థమవుతోందని అన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వారు ఎలాంటి ఆధారాలను వెల్లడించలేదు.నర్సంపేట పట్టణంలో ఎన్ని విగ్రహాలు అనుమతులతో ఏర్పాటు చేశారో అధికారులు వెల్లడించాలని ప్రశ్నించిన వారు.. ప్రజల మనోభావాలను గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కార్యక్రమం నేపథ్యంలో ప్రస్తుతం ధర్నాను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల సమయం ఇస్తున్నామని, ఈలోపు విగ్రహ గద్దెను కూల్చిన బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా, ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఎర్రబెల్లి దయాకర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్



# మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి సీతక్క

- సమ్మక్క–సారలమ్మ వనదేవతలకు ప్రత్యేక పూజలు
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన

**మేడారం, ఆగస్టు 10 :** తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క–సారలమ్మ వనదేవతలను మంత్రి దనసరి అనసూయ సీతక్క సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్న నూతన క్యూ లైన్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, జిల్లా అధికారులు,



# ఒక్క పిలుపు... ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా!

- "మన జెండా.. మన గౌరవం.. మన దేశం.. మన బాధ్యత"
- 'హర్ ఘర్ తిరంగా'తో దేశభక్తి చాటుదాం... డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

**నర్సంపేట/ వరంగల్, ఆగస్టు 10 : :**
బీజేపీ జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి నివాసంలో జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేశారు. మువ్వన్నెల జెండా రెపరెపల మధ్య దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ "ఒక్క పిలుపు.. కోట్ల గుండెల్లో ఉప్పొంగిన జాతీయవాదం. ప్రతి ఇంటా ఎగిరే త్రివర్ణ పతాకం.. ప్రతి భారతీయుడి గుండెల్లో నిండిన దేశభక్తికి ప్రతీక" అని అన్నారు.భారతదేశం స్వాతంత్ర్యం కోసం



తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా కేవలం మూడు రంగుల వస్త్రం కాదని దేశ గౌరవం, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి, జాతీయ ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఆగస్టు 10 :నుంచి 15 వరకు ప్రతి ఇంటిపైనా సగర్వంగా మువ్వన్నెల జెండాను ఎగురవేసి 'విశ్వగురు భారత్' సత్తాను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు.దేశ ప్రగతి కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యంతోనే బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు."మన జెండా.. మన గౌరవం.. మన దేశం.. మన బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని జాతీయ

# మగ్గం ఆగకూడదు.. కార్మికుడి గూడు కదలకూడదు!

- గృహనిర్మాణ శాఖ మంత్రి 'పొంగులేటి'కి వినతిపత్రం అందజేసిన చిప్ప వెంకటేశ్వర్లు నేత
- చేనేత, వృత్తి కార్మికుల కోసం పథకాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందించిన మంత్రి
- చేనేతకు భరోసా.. 'వర్క్‌షెడ్ కమ్ హౌస్'కు ప్రతిపాదన
- చేనేత కుటుంబాలకు ఒకే పథకంలో ఉపాధి.. నివాసం

**కొత్తవాడ/వరంగల్, ఆగస్టు 10 ::** చేనేత కార్మికులు, వృత్తి కళాకారుల సంక్షేమం కోసం గతంలో అమలు చేసిన 'వర్క్‌షెడ్ కమ్ హౌస్' పథకాన్ని తిరిగి అమలు చేయాలని కోరుతూ చేనేత నేత చిప్ప వెంకటేశ్వర్లు గృహనిర్మాణ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారు.హనుమకొండ జిల్లా పర్యటనలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని చిప్ప వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి నూలు దండతో సత్కరించి, చేనేత శాలువాతో ఘనంగా సన్మానించారు.ఇటీవల 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంత్రి కొండా సురేఖతో ఫోన్‌లో మాట్లాడిన చిప్ప వెంకటేశ్వర్లు.. చేనేత కార్మికులు, వృత్తి కళాకారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా 'వర్క్‌షెడ్ కమ్ హౌస్' పథకాన్ని అమలు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి కొండా సురేఖ.. సమగ్ర ప్రణాళిక రూపొందించి గృహనిర్మాణ శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించాలని సూచించారు. దీంతో ఈ మేరకు తాజాగా వినతిపత్రాన్ని అందజేశారు.

### వృత్తితో పాటు నివాసానికి అవకాశం...

రాష్ట్రంలో చేనేత కార్మికుల స్థితిగతులను పరిశీలిస్తున్న సమయంలో పలువురు కార్మికులు తమకు పని చేసుకునేందుకు ప్రత్యేక స్థలం, నివాసానికి ఇల్లు రెండూ అవసరమని తెలియజేశారని చిప్ప వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం 'వర్క్‌షెడ్ కమ్ హౌస్' పథకాన్ని అమలు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా వృత్తి పనిని జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న వేలాది కుటుంబాలకు ఇలాంటి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా అర్హులైన వృత్తి కార్మికులకు కింది అంతస్తులో వృత్తి పని చేసుకునేలా, పై అంతస్తులో నివసించేలా వర్క్‌షెడ్ కమ్



హౌస్‌లను నిర్మించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనివల్ల చేనేత, ఇతర వృత్తి కళాకారులకు ఒకేసారి ఉపాధి, నివాస సౌకర్యం లభిస్తుందని వివరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన గృహనిర్మాణ శాఖ మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, వినూత్నమైన ప్రతిపాదన తీసుకువచ్చినందుకు అభినందించారు. ప్లాన్‌ను పరిశీలించి త్వరలో తీపికబురు చెబుతానని హామీ ఇచ్చినట్లు చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు.చేనేత, వృత్తి కళాకారుల జీవనోపాధిని కాపాడటంతో పాటు వారి నివాస సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజశేఖర్, టీపీసీసీ చేనేత విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం..

## టీసీఎస్ మెగా క్యాంపస్ డ్రైవ్

## ఆగస్టు 11న ఆదిలాబాద్‌లో నిర్వహణ: కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఆగస్టు 10 :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంయుక్తంగా ఆగస్టు 11న మెగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.ఆదిలాబాద్ పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్రైవ్ జరుగుతుందని పేర్కొన్నారు. 2024, 2025, 2026 సంవత్సరాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ పూర్తి చేసిన లేదా ఈ ఏడాది పూర్తి చేయనున్న విద్యార్థులు అర్హులని తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు అధికారిక ప్రకటనలోని క్యూఆర్ కోడ్ లేదా అందులో పేర్కొన్న లింక్ ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9502786438, 9849913061 నంబర్లను లేదా జిల్లా ఉపాధి కల్పన అధికారిని సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్, ఆగస్టు 10 :** జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి. భుజంగరావు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా గోడౌన్ సీళ్లు, పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.కావాలంటే దీనిని క్లుప్తంగా లేదా హిందీలో పత్రిక శైలిలో కూడా ఇస్తాను.

# ఇంద్రానగర్ దొడ్డి లో ఘనంగా బోనాల ఉత్సవాలు

**శంషాబాద్, అగస్టు 20:**
శంషాబాద్ సర్కిల్ పరిధిలోని కొత్వాల్ గూడ డివిజన్ ఇంద్రనగర్ దొడ్డి లో సోమవారం బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆషాడ మాసం బోనాల ఉత్సవాలు బీఆర్ ఎస్ నాయకుడు కావాలి రాము కుటుంబ సమేతంగా అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషంగా ఉండేవిధంగా గ్రామదేవతల ఆశీర్వాదం ఉండాలన్నారు. ప్రస్తుతం వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామదేవతలు వర్షాలు కురిసే విధంగా చూడాలని కోరారు.



# యాలాల్ లో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

**యాలాల మండలం, ఆగస్టు 10 :**
యాలాల్ మండలం కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాలాల్ గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ కంజర్ల విజయలక్ష్మి యాదవ్ విజయక్క శ్రీమంత కానుక కార్యక్రమంలో పాల్గొని గర్భిణీ మహిళలకు గడప గడప కి వెళ్లి శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు, తదుపరి బాలింతలకు జనని కిట్స్ అందజేశారు.అనంతరం యాలాల్ నుంచి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగులను వాడటం మానేసి, పునర్వినియోగ బ్యాగులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ తరఫున తయారు చేయించిన బ్యాగులను యాలాల్ ప్రజలకు అందజేశారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి యాదవ్ మాట్లాడుతూ, తాండూర్ నియోజకవర్గంలోని గ్రామ గ్రామానికి వెళ్లి గర్భిణీ మహిళలకు శ్రీమంతం కార్యక్రమాలు నిర్వహిస్తూ, జనని కిట్స్ అందించడంతో పాటు ప్రజలకు CPR శిక్షణ వంటి పలు సేవా కార్యక్రమాలను ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మాజీ కో ఆప్షన్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా, ప్రకాష్ గౌడ్, ఉప మాజీ సర్పంచ్ గొల్ల శ్రీనివాస్ కమ్మరి శేఖర్,అమ్రేష్ ముదిరాజ్, నర్సిములు మాలిగేరి,బల్ రాజ్,చిట్లపల్లి రవి,సురేష్ మంగలి అనంతమ్మ మహిళలు తదితరులు పాల్గొన్నారు



చురకలు



# గుండ్లకుంటలో మైసమ్మ తల్లికి ఘనంగా బోనాల వేడుకలు




**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,10**

కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు గుండ్లకుంట గ్రామంలో మైసమ్మ తల్లికి బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, తలపై బోనాలు ఎత్తుకుని భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు.ఈ సందర్భంగా మైసమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. డప్పు వాయిద్యాలు, సంప్రదాయ కళారూపాల మధ్య బోనాల వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి.గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ బోనాల వేడుకలు గుండ్లకుంట గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి.

## విలువలతో కూడిన రాజకీయాలు నేర్చుకోవాలి

- విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు అవసరం, రాజకీయ హంగామాలు కాదు... టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్
- విగ్రహం పేరుతో శవరాజకీయాలు...రాజకీయ డ్రామాలకు నర్సంపేటలో చోటు లేదు



**నర్సంపేట, ఆగస్టు 10 : :** విగ్రహాల ఏర్పాటుకు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాల్సిందేనని, రాజకీయ హంగామాలు చేయడం ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం సరికాదని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. నర్సంపేటలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు బీఆర్ఎస్ నాయకులు నిర్మించిన గద్దె విషయంలో నిబంధనలు పాటించారా? అని ఆయన ప్రశ్నించారు. భూమి అసైన్డ్ భూమా, ప్రైవేట్ భూమా అనే అంశంతో సంబంధం లేకుండా రోడ్డుకు ఎంత దూరంలో గద్దె నిర్మించారు, మున్సిపల్ అనుమతులు తీసుకున్నారా అనే విషయాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎదురుగా వివాదాస్పదంగా గద్దె నిర్మించి ఉద్దేశపూర్వకంగా నర్సంపేటలో శాంతిభద్రతల సమస్యను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం శవ రాజకీయాలకు పాల్పడటం సరికాదని విమర్శించారు.

### అనుమతులతోనే విగ్రహాలు ఏర్పాటు చేయాలి...

నర్సంపేటలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఉదాహరణగా పేర్కొంటూ.. రోడ్డుకు తగిన దూరంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి, చుట్టూ పార్కు నిర్మించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతులతో పూర్తి చేశారని తెలిపారు. అదే విధంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని కూడా మున్సిపల్ అనుమతులు తీసుకుని, భూమి మధ్యలో ఏర్పాటు చేసి ఉంటే ఇంతటి వివాదం తలెత్తేదా? అని ప్రశ్నించారు.దాత భూమిని ఇచ్చినంత మాత్రాన రోడ్డుపై గద్దె నిర్మించుకోవడానికి అనుమతి ఇచ్చినట్లు కాదని అన్నారు. మిగిలిన భూమిని ఎలా వినియోగించాలనుకుంటున్నారో బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులకు విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు, అనుమతుల ప్రక్రియ తెలియదా? అని ప్రశ్నించారు. నర్స అనేక విగ్రహాలు ఉన్నాయని, వాటికి నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు.

### ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించింది...

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి గుండెపోటు వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం స్పందించిందని రామానంద్ తెలిపారు. ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.ఉద్యమకారుడిగా ఆయన సేవలను గౌరవిస్తూ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ప్రభుత్వం సహకరించిందన్నారు. అలాంటి ప్రభుత్వంపై ఇప్పుడు అనవసర ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు."పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఎందుకు అడ్డుపడుతుంది? ఒక్కసారి వాస్తవాలను ఆలోచించాలి" అని అన్నారు. సాధారణ ప్రజలైనా, మాజీ ప్రజాప్రతినిధులైనా మున్సిపల్ చట్టాలు అందరికీ సమానంగా వర్తిస్తాయని స్పష్టం చేశారు.అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే గద్దె నిర్మిస్తే అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవడం సహజమన్నారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్న అధికారులపై దౌర్జన్యాలకు పాల్పడటం, నర్సంపేటలో అనవసర ఉద్రిక్తతలు సృష్టించడం సరికాదని హితవు పలికారు."నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రశాంతమైన నర్సంపేట వాతావరణాన్ని దెబ్బతీయొద్దు" అని పెండెం రామానంద్ సూచించారు.

## ప్రియాంక మృతి అత్యంత దురదృష్టకరం: మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్ ఆగస్టు10 :**

హైదరాబాద్: గాంధీ ఆస్పత్రి మార్చురీలో మెడికో విద్యార్థిని ప్రియాంక భౌతికకాయానికి మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రియాంక తండ్రిని మంత్రి ఓదార్చి ధైర్యం చెప్పారు.ప్రియాంక మృతి అత్యంత దురదృష్టకరమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆమె మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి తమతో పాటు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.నిందితులు చట్టాల్లోని లోపాలను ఆసరాగా చేసుకొని తప్పించుకునే అవకాశం లేకుండా చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# ఖాతాలు తెరవడమే కాదు.. వినియోగం పెంచాలి...

- జన్‌ధన్ ఖాతాలు 3 లక్షలు దాటినా.. ఆపరేటివ్ ఖాతాల్లో తగ్గుదల
- గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణపై ఫోకస్...పేదల ఖాతాల్లోకి పథకాల ప్రయోజనాలు చేరాలి
- 2024లో 2.69 లక్షలు.. 2026 నాటికి 3.02 లక్షలకు చేరిన జన్‌ధన్ ఖాతాలు
- జన్‌ధన్ నుంచి డీబీటీ వరకు.. కేంద్రాన్ని నిలదీసిన వరంగల్ ఎంపీ కడియం కావ్య



**వరంగల్, ఆగస్టు 10 : :** ప్రధానమంత్రి జనధన్ యోజన (PMJDY) కింద వరంగల్ జిల్లాలో ఆర్థిక సేవల పరిస్థితి, జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కార్డుల జారీ, ఆధార్ అనుసంధానం, ఖాతాల నిర్వహణ, డీబీటీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణకు సంబంధించిన వివరాలను కూడా ఆమె కోరారు.వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాలో పీఎంజేడీవై ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా.. 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగాయి. ఇదే కాలంలో ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470కు, రూపే కార్డులు 2,12,030 నుంచి 2,26,409కు పెరిగాయి.అయితే జనధన్ ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ ఆపరేటివ్ ఖాతాల సంఖ్య తగ్గడం గమనార్హం. 2024 మార్చిలో 2,28,257 ఖాతాలు ఆపరేటివ్‌గా ఉండగా.. 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. పీఎంజేడీవై ఖాతాలకు అనుసంధానమైన డీబీటీ పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి తన సమాధానంలో తెలిపారు.

### ఖాతాలు తెరవడమే కాదు..

### వినియోగం పెరగాలి...

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ జిల్లాలో జనధన్ ఖాతాల సంఖ్య పెరగడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఖాతాలు తెరవడమే కాకుండా అవి నిరంతరం వినియోగంలో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేలా బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేయాలని కోరారు. డిజిటల్ చెల్లింపులపై అవగాహనను విస్తృతం చేయడంతో పాటు మహిళలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు సహా ప్రతి వర్గానికి ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.వరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు, డీబీటీ ప్రయోజనాలు అందేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ కడియం కావ్య కోరారు.

# మూడు దశాబ్దాల నిస్వార్థ సేవకు 'గ్లోబల్ బెస్ట్ కపుల్' గౌరవం...

- డా.కరుకాల అనితారెడ్డి–రాంరెడ్డి దంపతులకు గ్లోబల్ బెస్ట్ కపుల్ అవార్డు–2026
- ఆపన్నులకు ఆత్మీయత.. అనాథలకు అండ.. సేవలో ఆదర్శ దంపతులు
- దాంపత్యానికి దయ తోడై... సేవకు చిరునామాగా నిలిచిన దంపతులు
- నిస్వార్థ సేవకు నజరానా.. ఆదర్శ దంపతులకు అంతర్జాతీయ గౌరవం






**హన్మకొండ, ఆగస్టు 10 : :** సమాజ సేవలో మూడు దశాబ్దాలుగా విశేష సేవలందిస్తున్న డా.కరుకాల అనితారెడ్డి–కరుకాల రాంరెడ్డి దంపతులకు 'గ్లోబల్ బెస్ట్ కపుల్ అవార్డు–2026' లభించింది. ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్, గ్లోబల్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ & కన్జుమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, హైదరాబాద్ సంస్థలు సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందజేశాయి.అనురాగ్ సొసైటీ చైర్మన్‌గా, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలిగా కొనసాగుతున్న డా.కరుకాల అనితారెడ్డి, రాంరెడ్డి దంపతులు గత 30 సంవత్సరాలుగా స్వంత ఖర్చులతో నిస్వార్థంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనాథలు, దివ్యాంగులు, మహిళలు, వృద్ధులు, అవసరార్థులకు అండగా నిలుస్తూ తమ సేవలను కొనసాగిస్తున్నారు. ఈ సేవలను గుర్తించిన సంస్థలు వారిని 'గ్లోబల్ బెస్ట్ కపుల్–2026' అవార్డుకు ఎంపిక చేసి సత్కరించాయి.ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ "ఒకే మాట.. ఒకే బాట.. ఒకే సేవ" అనే స్ఫూర్తితో జీవితంలోనే కాకుండా సమాజ సేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్న దంపతులు డాక్టర్ అనితారెడ్డి, కరుకాల రాంరెడ్డి అని కొనియాడారు. నిస్వార్థ సేవా కార్యక్రమాలతో ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న వీరిని గ్లోబల్ బెస్ట్ కపుల్–2026 అవార్డుకు ఎంపిక చేయడం తమ సంస్థకు గర్వకారణమన్నారు.అవార్డు అందుకున్న సందర్భంగా డాక్టర్ కరుకాల అనితారెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన అవార్డు తమ సేవలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ గౌరవంతో తమపై బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్‌లో మరిన్ని సమాజహిత కార్యక్రమాలు చేపట్టి, అవసరార్థులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.తమ సేవలను గుర్తించి 'గ్లోబల్ బెస్ట్ కపుల్–2026' అవార్డుతో సత్కరించిన ఇంటర్నేషనల్ మనం

# ఎల్కతుర్తికి పరిపాలనా హంగులు.. బాలికల విద్యకు కొత్త భవనం

- తహసీల్దార్ కార్యాలయానికి భూమిపూజ.. కేజీబీవీ నూతన భవనం ప్రారంభం
- మంత్రులు పొంగులేటి, పొన్నం.. డీసీసీ అధ్యక్షుడు ఇనగాల, కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్

**హన్మకొండ/ఎల్కతుర్తి, ఆగస్టు 10 : :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పర్యటించారు. నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నూతన భవనాన్ని ప్రారంభించారు.

### ఆధునిక వసతులతో తహసీల్దార్ కార్యాలయం...

ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మెరుగైన వసతులతో కూడిన కార్యాలయంలో సేవలు పొందేలా భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### బాలికలకు మెరుగైన వసతులు...

ఎల్కతుర్తిలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. పేద, వెనుకబడిన కుటుంబాలకు చెందిన బాలికలకు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు మెరుగైన వసతి, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థినులు సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించేలా కేజీబీవీలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ అధ్యక్షుడు, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఛైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



# సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పర్యవేక్షణ



**సంగారెడ్డి, ఆగస్టు 10: :** ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సంగారెడ్డి పట్టణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కలిసి సోమవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించనున్న అంబేద్కర్ స్టేడియం, తారా డిగ్రీ కళాశాల ప్రాంగణాలను సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, వేదిక ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పరిశీలనలో ఆర్అండ్‌బీ అధికారులు, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పోలీసు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈవీ రంగంలో దూసుకెళ్తున్న భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 10: :** దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతోందని పీఐబీ తెలిపింది. 2016లో సుమారు 50 వేలుగా ఉన్న ఈవీ విక్రయాలు 2025 నాటికి 23 లక్షలకు చేరి దాదాపు 46 రెట్లు పెరిగాయి. ఈవీల వాటా 2015–16లో 0.08 శాతం ఉండగా, 2025–26 నాటికి 8.26 శాతానికి చేరింది.2026 జులై నాటికి దేశవ్యాప్తంగా 52,718 ప్రజా ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులో ఉండగా, వాటిలో 16,561 ఫాస్ట్ ఛార్జింగ్ కేంద్రాలు ఉన్నాయి. పీఎం ఈ–డ్రైవ్ పథకం కింద 28 లక్షలకు పైగా ఈవీలకు మద్దతు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2026 జనవరి నాటికి 22.12 లక్షల వాహనాలు విక్రయమ య్యాయి.దేశీయ తయారీ, బ్యాటరీ ఉత్పత్తి, ఛార్జింగ్ మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్రం పలు ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తోంది. 2030 నాటికి మొత్తం వాహన విక్రయాల్లో 30 శాతం విద్యుత్ వాహనాలే ఉండాలనే



# తలసేమియా చిన్నారులకు 'చేయూత'.. బాధిత కుటుంబాలకు భరోసా!

- ప్రతి చిన్నారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం... మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే నాయిని
- చిన్నారుల కష్టాలకు చలించిన ప్రభుత్వం.. తలసేమియాకు ప్రత్యేక చేయూత



**హనుమకొండ, ఆగస్టు 10 ::** తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు, వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. తలసేమియా బాధిత చిన్నారులకు అవసరమైన రక్తం అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.హనుమకొండలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తలసేమియా బాధిత చిన్నారులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి లు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నది చిన్నారులు మాత్రమే కాదని, వారి కుటుంబ సభ్యులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తలసేమియా బాధితుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.హనుమకొండలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా ఇప్పటికే సుమారు 235 మంది దరఖాస్తు చేసుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా ఈ సహాయం అందే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు. వికలాంగుల కోటాకు సంబంధించి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని తెలిపారు.తలసేమియా చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని మంత్రి స్వాగతించారు. గతంలో అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పరిష్కారం కాని సమస్యలకు ప్రస్తుత ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని అన్నారు.

**రక్తదాతలకు అభినందనలు...**

రక్తాన్ని ఎక్కడ పడితే అక్కడ డబ్బులు చెల్లించి కొనుగోలు చేయలేమని మంత్రి పేర్కొన్నారు. తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం చేస్తున్న ప్రతి దాతను రాష్ట్ర ప్రభుత్వం తరపున మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని తెలిపారు. రక్తదాతలు ముందుకు వచ్చి చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు.తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ప్రభుత్వం భవిష్యత్తులోనూ అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అవసరమైన కుటుంబాలకు ఇళ్ల సౌకర్యం కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాల ద్వారా ఇళ్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, ఇండియన్

# మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు.

**వలిగొండ ఆగస్టు 10 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుజల దాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరంతరం భువనగిరి నియోజకవర్గం ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం అభివృద్ధి కోసం పనిచేసిన పైళ్ళ శేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి మరియు పండ్ల పంపిణీ చేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వలిగొండ మాజీ జడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ సింగిల్ విండో మాజీ చైర్మన్ సూరకంటి వెంకటరెడ్డి శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ కుమార్ రెడ్డి వలిగొండ మాజీ ఎంపిటిసి పల్సం రమేష్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అఫ్రోజ్ కొమురెల్లి సంజీవరెడ్డి మోటే నరసింహ సర్పంచ్ భుడిగే లింగస్వామి మాజీ సర్పంచ్ గంగారం రమేష్ ఆకుల వెంకన్న బొడ్డుపల్లి కృష్ణ ఐటి పాముల సత్యనారాయణ నాయకులు కొండూరు వెంకటేశం బొల్లు కృష్ణ సోమనబోయిన సతీషు సోమనబోయిన రమేష్ బాలేశ్వర్ బలుగూరి నరేష్ రెడ్డి పోలేపాక సత్యనారాయణ, పల్సం రాజు ఎడవెల్లి శాంత్ కుమార్ ప్రభాకర్ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు కూచిమల్ల సుధాకర్, కాసుల పెద్దలు కాశమల్ల శేఖర్ నానమాల ఉప్పలయ్య చెవ్వ వెంకటేశం బూడిద పాపయ్య,కూచిమల్ల నాగేష్, నాగేందర్,పాపయ్య కుమార్ రమేష్ బత్తుల ఆంజనేయులు గుండు శేఖర్ బూడిద రాజు మండల నాయకులు



# దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలి.. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- జంతర్‌మంతర్ వద్ద మహాధర్నాలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర
- 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి న్యాయం చేయాలి




**వరంగల్, ఆగస్టు 10 ::** దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదా కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.అఖిల భారత దళిత క్రైస్తవ హక్కుల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు సమీపిస్తున్నా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలోనూ పాత నిబంధనల కారణంగా దళిత క్రైస్తవులకు అన్యాయం జరగడం బాధాకరమన్నారు.1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే డిమాండ్ న్యాయమైనదని పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు...**

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, దేశవ్యాప్తంగా ఉన్న దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా డిమాండ్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని రవిచంద్ర స్పష్టం చేశారు. దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేలా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ముందుకు రావాలని కోరారు.కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఒత్తిడి తీసుకువచ్చి దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. "అన్నదమ్ముల మాదిరిగా విడిపోయిన మనం.. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం పార్లమెంటులో కలిసి పోరాడాలి" అని చంద్రబాబును ఉద్దేశించి రవిచంద్ర పిలుపునిచ్చారు.మహాధర్నాలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, తెలంగాణ ఫుడ్స్ మాజీ ఛైర్మన్ మేడె రాజీవ్‌సాగర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, గడ్డం సాల్మన్‌రాజు, సంగటి మనోహర్, చిన్న జోసెఫ్, రావులపాటి మోజెస్, మాణిక్యాల ఎలియ, డాక్టర్ ఇస్లామొద్దీన్ తదితరులు ప్రసంగించారు. "జై భీమ్", "దళిత క్రైస్తవుల ఐక్యత వర్ధిల్లాలి", "1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలి", "దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలి" అంటూ నినాదాలు చేశారు.

# రక్తదానం.. ఓ చిన్నారి జీవితానికి ప్రాణదానం!

- ప్రాణాల కోసం పోరాడుతున్న చిన్నారులకు అండగా నిలుద్దాం... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- రక్తదాతలు ముందుకు రావాలి...తలసేమియాపై సమరం.. రక్తదానమే ఆయుధం
- చిన్నారుల కన్నీళ్లు తుడుద్దాం.. రక్తదానంతో ప్రాణాలు కాపాడుదాం

హనుమకొండ, ఆగస్టు 10 :: తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో పోరాడుతున్న చిన్నారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అండగా నిలిచారు. హనుమకొండలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో సోమవారం తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి వారిలో ధైర్యం నింపారు.






**ప్రతీ 15 రోజులకు రక్తం అవసరం...**

తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు సాధారణంగా ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరమవుతుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం రక్తం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు.రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తలసేమియా చిన్నారులకు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం లభిస్తుందని, ఈ విషయంలో యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు మరింత చొరవ చూపాలని కోరారు.వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇప్పటికే పలుమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు కేఆర్ నాగరాజు తెలిపారు. తలసేమియా చిన్నారులకు నిరంతర రక్త సరఫరా అందేలా భవిష్యత్తులోనూ రక్తదాన కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.తలసేమియా చిన్నారులకు చికిత్సతో పాటు ఆత్మస్థైర్యం, కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల సంక్షేమం కోసం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రక్తదాతలు కలిసి పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఈవీ శ్రీనివాస్, అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ పై కాంగ్రెస్ గురి... జీడబ్ల్యూఎంసీ ఎన్నికలపై కసరత్తు...

- డీసీసీ భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష... మంత్రి పొంగులేటి దిశానిర్దేశం
- డీసీసీ కార్యాలయానికి భూకేటాయింపు, పార్టీ బలోపేతం, సంక్షేమ పథకాలపై విస్తృత చర్చ



**హనుమకొండ, ఆగస్టు 10 ::** రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే కార్యాచరణకు సిద్ధమవుతోంది. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై దృష్టి సారించింది.హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. డీసీసీ భవన్‌కు వచ్చిన మంత్రికి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

**జీడబ్ల్యూఎంసీపై ప్రత్యేక దృష్టి...**

రాబోయే జీడబ్ల్యూఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే డివిజన్ల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేయాలని సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ గెలుపు వ్యూహాలను సిద్ధం చేయాలని మంత్రి పొంగులేటి నాయకులకు దిశానిర్దేశం చేశారు.నూతనంగా నియమితులైన 13 మండల అధ్యక్షులు, 10 డివిజన్ అధ్యక్షులతో కలిసి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

**డీసీసీ కార్యాలయానికి భూకేటాయింపు...**

హనుమకొండ జిల్లా నూతన డీసీసీ కార్యాలయ నిర్మాణానికి భూమి కేటాయింపు ప్రతిపాదనను రాబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరింది. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

**ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి...**

ప్రస్తుత ఓటర్ల జాబితాలోని తప్పుడు చిరునామాలు, బోగస్ ఓట్లు, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి...**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికి తీసుకెళ్లే బాధ్యతను నూతన మండల, డివిజన్ అధ్యక్షులకు అప్పగించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పార్టీకి, ప్రజలకు మధ్య అనుసంధానంగా పనిచేయాలని సూచించారు.అలాగే PACS, స్టేట్ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని, ప్రతిపాదనలను డీసీసీ ద్వారా రాష్ట్ర కమిటీకి పంపేలా సమన్వయం చేయాలని సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మేయర్ గుండు సుధారాణి, వివిధ విభాగాల చైర్మన్లు, టీపీసీసీ నాయకులు, నూతన మండల, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# గంధం పరిమళంలో... గంగా–జమునా తహజీబ్!

**కాజీపేట ఉర్సులో వెల్లివిరిసిన మత సామరస్యం**

**గంధం ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**కాజీపేట, ఆగస్టు 10 ::** కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు మత సామరస్యం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన గంధం ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలతో కలిసి కేఆర్ నాగరాజు దర్గాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో గంధం ఉత్సవాల్లో పాల్గొన్నారు.కాజీపేట దర్గా ఉర్సు కుల, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఆధ్యాత్మిక వేడుకగా నిలుస్తోందని కేఆర్ నాగరాజు అన్నారు. ఇలాంటి ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని, ప్రేమ, సోదరభావం, మత సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఉర్సుకు హాజరైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును దర్గా నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి ఖుసూర్ పాషా సాహెబ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగాయి.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, దర్గా నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక... కాజీపేట దర్గా

- దర్గా ఉర్సు ఉత్సవాల్లో మంత్రులు పొంగులేటి, అజారుద్దీన్, కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- వచ్చే ఉర్సు నాటికి మౌలిక వసతుల అభివృద్ధి పూర్తి చేస్తాం: నాయిని రాజేందర్‌రెడ్డి



**కాజీపేట, ఆగస్టు 10 : :** కులమతాలకు అతీతంగా మానవత్వం, ప్రేమ, సోదరభావాన్ని చాటేలా కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రులు పేర్కొన్నారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి, ఉర్సు ఉత్సవాల ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం నిర్వహించిన సభలో నాయకులు కాజీపేట దర్గా ఉర్సు విశిష్టత, మత సామరస్యం, దర్గా అభివృద్ధి, జాయరీన్లకు మౌలిక వసతుల కల్పనపై మాట్లాడారు.

### సర్వమత ఐక్యతకు ప్రతీక...

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవులు అనే భేదాలు లేకుండా అన్ని మతాల ప్రజలు ఒకే చోటకు చేరి ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు. కాజీపేట దర్గాలో కనిపిస్తున్న సర్వమత ఐక్యత తనను ఎంతో ఆనందపరిచిందని తెలిపారు.ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా సాహెబ్, నిర్వాహకులను అభినందించారు. దర్గాకు వచ్చే జాయరీన్లకు అవసరమైన మౌలిక వసతులపై నిర్వాహకులు ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు.దర్గా అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో సమన్వయం చేసుకుని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సమగ్రంగా సిద్ధం చేయాలని సూచించారు. కాజీపేట దర్గా సర్వమతాలకు సంబంధించిన అరుదైన ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిందని, అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.వచ్చే ఉర్సు నాటికి అవసరమైన అభివృద్ధి, మౌలిక వసతుల పనులను పూర్తి చేసే బాధ్యతను ఇన్‌చార్జి మంత్రిగా తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.

### ప్రేమ, ఐక్యతతోనే అభివృద్ధి...

మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ దేశానికి ప్రస్తుతం అత్యంత అవసరమైనది ప్రేమ, ఆప్యాయత, ఐక్యత, సోదరభావమన్నారు. ప్రజలంతా కలిసిమెలిసి పనిచేసినప్పుడే సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల్లో తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే గంగా–జమునా తహజీబ్ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కులమత భేదాలను పక్కనపెట్టి అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### ముందుగా మనుషులం.. ఆ తర్వాతే కులం, మతం...

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ మత సామరస్యం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల్లో వందల సంవత్సరాలుగా కులమత భేదాలు లేకుండా ప్రజలు కలిసి పాల్గొంటున్నారని తెలిపారు.ముందుగా మనం మనుషులం.. ఆ తర్వాతే కులం, మతం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. మతం, కులం పేరుతో విభేదాలు పెంచుకుంటే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందడం కష్టమవుతుందని అన్నారు. సోదరభావంతో అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### వచ్చే ఉర్సు నాటికి పనులు పూర్తి...

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, దర్గా నిర్వాహకులు సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు.ఉర్సుకు నెల రోజుల ముందుగానే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను సమన్వయం చేసినట్లు చెప్పారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. ఉర్సు సందర్భంగా జాయరీన్ల కోసం సుమారు రూ.40 లక్షలతో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు కాజీపేట దర్గాకు వస్తున్నారని, వారికి ఉచిత భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. దర్గా అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు అందించామని, అవి తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయితే జాయరీన్లకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా సాహెబ్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభం

**వరంగల్, ఆగస్టు 10 :**
దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ పునర్నిర్మాణ పనులకు గ్రేటర్ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శ్రీకారం చుట్టారు. విగ్రహానికి సంబంధించిన గద్దెను కూల్చివేసిన అనంతరం అదే ప్రదేశంలో పాలతో క్షీరాభిషేకం నిర్వహించి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనైనా పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అదే స్థలంలో ఘనంగా పునఃప్రతిష్ఠిస్తామని స్పష్టం చేశారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలు, ఆయన ఆశయాలు, ప్రజలతో ఉన్న అనుబంధానికి ప్రతీకగా విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.కావాలంటే దీన్ని మరింత క్లుప్తంగా కూడా సిద్ధం చేస్తాను.

## మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.**




**నారాయణపేట, ఆగస్టు,10**
నారాయణపేట జిల్లాలో మహిళలు, యువతులు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్లు నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, బాలికలు ఆకతాయిల వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గృహహింస, లైంగిక వేధింపులు లేదా ఇతర ఏ విధమైన అన్యాయాలకు గురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, కాలనీలు వంటి ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు గురైనప్పటికీ, ఉద్యోగ మహిళలు తమ కార్యాలయాల్లో వేధింపులకు గురైనప్పటికీ వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు మరియు బాలికలపై జరిగే వేధింపుల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గృహహింసకు గురవుతున్న మహిళలు కూడా మౌనంగా బాధపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితులకు అవసరమైన న్యాయం అందించేందుకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల ఫిర్యాదులపై సత్వర స్పందనతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణ, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికలను ఉపయోగించే సమయంలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మైనర్ బాలికలను వేధించడం, లైంగికంగా వేధించడం వంటి ఘటనల్లో సంబంధిత నిందితులపై పోక్సో చట్టం కింద కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్షించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయలేని మహిళలు, బాలికలు లేదా వారి కుటుంబ సభ్యులు షీ టీమ్ ఫోన్ నెంబర్ 8712670398 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి బాధితులకు న్యాయం

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలి

- నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి రాజయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ జనార్ధన్ డిమాండ్

**ఆలేరు, ఆగస్టు 10:**
అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి రాజయ్య, ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ జనార్ధన్ డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు.సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొల్లూరి రాజయ్య, ఆర్ జనార్ధన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలు, దేశ అభివృద్ధిని పక్కనపెట్టి బడా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందం దేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రైతులు పండించే పంటలకు మార్కెట్ అవకాశాలు తగ్గిపోయి, విదేశాల నుంచి దిగుమతయ్యే వ్యవసాయ ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌ను ఆక్రమించే పరిస్థితి ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. దీంతో రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర పొందలేక తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. దేశీయ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని రక్షించేందుకు ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లు దేశ కార్మిక వర్గం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న సుమారు 44 కార్మిక చట్టాలు, హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను బలహీనపరిచారని నాయకులు విమర్శించారు. కొత్త లేబర్ కోడ్‌లతో కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతనాలు, పని పరిస్థితులు తదితర అంశాల్లో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కార్మిక సంఘాలు, లక్షలాది మంది కార్మికులు ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను గుర్తించి నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలనే డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని నాయకులు అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులకు పంటలకు తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న రైతాంగంపై స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రభావం




పడకుండా కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జక్క దయాకర్‌రెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడాల బాలమల్లేష్, రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పల్లె మల్లారెడ్డి, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పుల కొమురయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి తమ్మడి అంజయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిరబోయిన రాజయ్య, జిల్లా నాయకుడు చిరబోయిన కొమురయ్య, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.ఉదయ్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఊరడి రామచంద్రు, తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు ఇప్ప రామకృష్ణ, ఏనుగుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటమే సీపీఐ లక్ష్యం

- బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రచారజాత
- సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి




**ఆలేరు, ఆగస్టు 10(సమయం న్యూస్**
ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరగాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వ విధానాలతో సామాన్య ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని ప్రజలకు వివరించడంతోపాటు, వాటిపై విస్తృత అవగాహన కల్పించేందుకు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలేరు నియోజకవర్గ స్థాయి ప్రచారజాతను సోమవారం ఆలేరు పట్టణంలో ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం యానాల దామోదర్‌రెడ్డి జెండా ఊపి ప్రచారజాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా సామాన్య ప్రజలపై ఆర్థిక భారం రోజురోజుకూ పెరుగుతోందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నప్పటికీ ప్రజల ఆదాయాలు అందుకు అనుగుణంగా పెరగడం లేదన్నారు. నిరుద్యోగం, కార్మికుల సమస్యలు, రైతుల ఇబ్బందులు, పేదలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రభుత్వ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. 'బద్లావ్ జరూరీ హై మార్పు కావాలి' అనే నినాదంతో దేశవ్యాప్తంగా సీపీఐ నిర్వహిస్తున్న ప్రచారజాతలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### కార్మికుల హక్కులను కాపాడాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ రంగాన్ని రక్షించాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టి, పేదలు, కార్మికులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సీపీఐ నిర్వహిస్తున్న ప్రచారజాతను ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. ఆలేరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఆగస్టు 10, 11 తేదీల్లో ప్రచారజాత కొనసాగుతుందని, కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, వివిధ మండలాల కార్యదర్శులు చౌడబోయిన కనకయ్య, గాదేగాని మాణిక్యం, కల్లేపల్లి మహేందర్, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత, ఆలేరు పట్టణ కార్యదర్శి గొట్టిపాముల రాజు, మండల నాయకులు పోతు ప్రవీణ్, కందుల మధు, మాటూరి జానమ్మ, జంగ సారల, బొడ్డు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## ఆలేరు ఎస్‌హెచ్‌ఓకు పెన్షనర్ల సంఘం ప్రతినిధుల సన్మానం

- పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి

**ఆలేరు, ఆగస్టు 10:** ఇటీవల బదిలీపై వచ్చి ఆలేరు పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా బాధ్యతలు స్వీకరించిన ఉదయ్ కిరణ్‌ను తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్స్ (తప్రపా) యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు బొమ్మకంటి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యుడు బండ్రు రాజమల్లయ్య ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఆలేరు పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భాల్లో వారికి తగిన సహకారం అందించాలని ఎస్‌హెచ్‌ఓను కోరారు. వృద్ధులు, పెన్షనర్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చే సమయంలో వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి, అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.పోలీసు శాఖ, పెన్షనర్ల సంఘం మధ్య పరస్పర సహకారంతో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు.



# వ్యవసాయ కార్మిక వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ చట్టాలను రద్దు చేయాలి.

**వలిగొండ ఆగస్టు 10 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కార్మిక,రైతు,వ్యవసాయ కార్మిక కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జైల్ భరో కార్యక్రమం సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలో సోమవారం చేపట్టిన రాస్తారోకో సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందడి సత్తిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్రంలోని అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుందని ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతూ నయా ఉదారవాద సంస్కరణలు అమలు చేస్తుందన్నారు. నాటి స్వాతంత్ర కాలంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఉల్లంఘించి నూతన లేబర్ కోడ్లను ముందుకు తెచ్చిందని దీని ద్వారా కార్మిక హక్కులను హరించి వేస్తుందన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచేందుకు యాజమాన్యాలు కార్మికులను దోపిడీ చేసేందుకు పూర్తి స్వేచ్ఛనిస్తుందని మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ నూతన విబిజి గ్రామ్ జీ పథకం గా పేరును మార్చి రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్ద ఎత్తున భారం వేస్తూ తన బాధ్యతను తప్పుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు అమెరికా, బ్రిటన్ న్యూజిలాండ్ తో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్యవ్యాపారాలు చేసుకొని భారత వ్యవసాయ రంగంలో 32 దేశాల నుండి దిగుమతులను ప్రోత్సహిస్తుందని వీటికి జీరో సుంకంతో దిగుమతులు రావడంతో దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోయి రైతులు దివాలా తీసి అవకాశాలున్నాయన్నారు. భారతదేశంలో ఏటా పద్దెనిమిది లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్కు వస్తుండగా కనీసం మద్దతు ధరలు అమలు జరుపుకోవడం వల్ల రైతులు ఏటా నాలుగు లక్షల కోట్లు నష్టపోతున్నట్లు ప్రముఖ ఆర్థికవేత్త అశోక్ గులాటి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యయం పై 50% కలిపి మద్దతు ధరలు నిర్ణయిస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి ధరలను తగ్గించి




నిర్ణయించడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర రావడంలేదని వెంటనే పార్లమెంట్లో కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యవసాయ కార్మిక రైతు వ్యతిరేక బిల్లులను వెంటనే ఉపసంహరించు కోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు కూర శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొండే కిష్టయ్య,జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి,సిఐటియు గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండే నరసింహ, హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు జన్నీ జంగయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం,డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కవిడే సురేష్,వివిధ సంఘాల నాయకులు గర్దాసు నరసింహ, భీమనబోయిన జంగయ్య, కొండూరు సత్తయ్య, చేగురి నగేష్,గూడూరు బుచ్చిరెడ్డి,వేముల లక్ష్మయ్య, ఎడవెల్లి ఎల్లయ్య,వేముల చంద్రయ్య,మద్దెల శంకరయ్య,మారయ్య,వేముల అమరేందర్, మైసొల్ల నరేందర్,మారబోయిన ముత్యాలు,వడ్డేమాన్ రవి, నకిరే కంటి మహేందర్,భువనగిరి సాయి, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి గ్రామస్థాయిలో కమిటీలు

- **ప్రతి గ్రామంలో సీనియర్ సిటిజన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలి: రాష్ట్ర అధ్యక్షుడు పోతు నరసింహారావు**

**ఆలేరు, ఆగస్టు 10:** వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమం కోసం గ్రామస్థాయి నుంచి ప్రత్యేకంగా కృషి చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు పోతు నరసింహారావు సూచించారు. ప్రతి గ్రామంలో సీనియర్ సిటిజన్స్ కమిటీని ఏర్పాటు చేసి, వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఆలేరు పట్టణంలోని స్థానిక గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఉదయం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో మండలస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పోతు నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఎర్రగుంట వెంకటేశం, ఆలేరు యూనిట్ అధ్యక్షుడు చింతకింది మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతు



నరసింహారావు మాట్లాడుతూ వయోవృద్ధుల సంరక్షణ, పోషణ, హక్కుల పరిరక్షణపై కుటుంబ సభ్యులతో పాటు సమాజంలోనూ అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధాప్యంలో ఎదురయ్యే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వారికి అవసరమైన సహకారం, భరోసా అందేలా గ్రామస్థాయిలో వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో సీనియర్ సిటిజన్స్ గ్రామ కమిటీని ఏర్పాటు చేయాలని, ఆయా కమిటీలు వయోవృద్ధుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ఈ నెలాఖరులోగా మండల కమిటీని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా గ్రామ కమిటీ సమావేశాన్ని నిర్వహించి వయోవృద్ధుల సమస్యలు, వారి సంరక్షణ, పోషణ తదితర అంశాలపై చర్చించాలని తెలిపారు. వయోవృద్ధులకు ప్రభుత్వపరంగా అందుతున్న సంక్షేమ పథకాలు, హక్కులు, సౌకర్యాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు బొమ్మకంటి లక్ష్మీనారాయణ, ఒగు క్రిస్టఫర్, ఆలేరు యూనిట్ కార్యవర్గ సభ్యులు పల్లాల మధుసూదన్, విశ్వంపట్ల బాల్‌రెడ్డి, బండ్రు రాజమల్లయ్య, బొమ్మకంటి బాలరాజు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు కంతి దాసు, జూకంటి ఉప్పలయ్య, శీలం రాంరెడ్డి, శీలం మల్లారెడ్డి, నరసింహాచారి, ప్రభాకర్, పెండెం సత్యనారాయణ, వీరస్వామి, ఆదాము, రాజయ్య, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# కత్తి వెంకటస్వామిని పరామర్శించిన వేముల సాంబయ్య గౌడ్

- **దశదినకర్మలో ఘన నివాళి...మృతురాలి చిత్రపటానికి పుష్పాంజలి**
- **కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి...సంతాపం**

**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 10 : :** టీపీసీసీ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి గౌడ్ సతీమణి కత్తి భవాని మృతి పట్ల వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కత్తి వెంకటస్వామి గౌడ్ స్వగృహంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా కత్తి భవాని చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబంతో కలిసి సాగిన ఆత్మీయ ప్రయాణాన్ని స్మరించుకున్నారు.అనంతరం కత్తి వెంకటస్వామిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. వెంకటస్వామి సతీమణి మృతి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు. ఆప్యాయత, మానవీయ విలువలకు ప్రతీకగా నిలిచిన ఆమె జ్ఞాపకాలు ఎల్లప్పుడూ కుటుంబ సభ్యుల హృదయాల్లో నిలిచిపోతాయన్నారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. భవాని ఆత్మకు శాంతి చేకూరాలని



ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొని కత్తి భవానికి నివాళులర్పించారు.

# కార్మికుల కష్టానికి.. రైతుల పంటకు న్యాయం చేయాలి!

- **ప్రైవేటీకరణపై పిడికిలి...నర్సంపేటలో కార్మిక, రైతు సంఘాల గర్జన...**
- **జైల్‌భరో, రాస్తారోకో.. లేబర్ కోడులు రద్దు చేయాలని డిమాండ్**
- **ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలి... ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం**




**నర్సంపేట, ఆగస్టు 10 : :** కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఇచ్చిన దేశవ్యాప్త జైల్‌భరో, రాష్ట్రవ్యాప్త రాస్తారోకో పిలుపులో భాగంగా నర్సంపేట పట్టణ కేంద్రంలో సోమవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ (న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ మోడెం మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను క్రమంగా ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. అమెరికా తదితర పెట్టుబడిదారీ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా దేశ సంపదను బహుళజాతి సంస్థలకు అప్పగించే విధానాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

**నాలుగు లేబర్ కోడులు రద్దు చేయాలి...**

కార్మికులు అనేక సంవత్సరాల పాటు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడులను తీసుకురావడం ద్వారా కార్మిక హక్కులను బలహీనపరుస్తున్నారని మల్లేశం విమర్శించారు. నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేసి కార్మిక హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మిడ్‌డే మిల్స్, ఇతర స్కీమ్ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. భవన నిర్మాణ, హమాలీ, రవాణా తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి...**

అన్ని పంటలకు ఉత్పత్తి వ్యయంపై అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని కోరారు. ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజుల పని, రోజుకు రూ.700 కనీస వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు.స్టీల్‌ప్లాంట్, విద్యుత్, ఆర్టీసీ, మున్సిపాలిటీలతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలని అన్నారు. విత్తన బిల్లు, ఆహార భద్రత సవరణ బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం భూసేకరణను నిలిపివేసి, 2013 భూసేకరణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఫారెస్ట్ రైట్స్ యాక్ట్, వన్ ఆఫ్ సెవెంటీ చట్టాలను సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఈర్ల పైడి, ఎంసీపీఐయూ ప్రజా సంఘాల నాయకులు కన్నం వెంకన్న, రాజాసాహెబ్, రాగ సుధ, రాజమౌళి, సింగతి మల్లికార్జున్, సీపీఎం ప్రజా సంఘాల నాయకులు ఈసంపల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, హనుమకొండ శ్రీధర్, న్యూడెమోక్రసీ నాయకులు జక్కుల తిరుపతి, ప్రదీప్, మల్లన్న, రంజిత్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు అడ్డూరి రాజు, లింగయ్య, సీపీఐ నాయకులు అక్కపెల్లి రమేష్, తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు సుక్క వీరన్న, భునగిరి సారయ్య, మదార్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక, రైతు సమస్యలు పరిష్కరించాలి

## సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో జైల్ భరో




**ఆలేరు, ఆగస్టు 10(సమయం న్యూస్** అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.31 వేలు, అంగన్‌వాడీ కార్మికులకు రూ.26 వేలు చెల్లించాలని కోరారు.సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆలేరు బస్టాండ్ సమీపంలోని వేణు కాంప్లెక్స్ ఎదుట జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. సహకార సంఘం మాజీ జిల్లా డైరెక్టర్ మొరిగాడి చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా నాయకుడు మొరిగాడి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్మికులు, రైతులు పాల్గొన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని కోరారు.డిమాండ్ల సాధన కోసం రాస్తారోకో నిర్వహించగా పోలీసులు నిరసనకారులను అరెస్టు చేశారు. అనంతరం వారిని ఆలేరు పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు పిక్క గణేష్, సీఐటీయూ మండల కన్వీనర్ సంఘీ రాజు, వడ్డెమాన్ బాలరాజు, బోడ హనుమంతు, ఘనగాని మల్లేశం, చౌడబోయిన యాదగిరి, గంధమల్ల కొమురయ్య, అన్నపూర్ణ, గంగుల రామపద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# డప్పుల కళాకారులకు దుస్తుల పంపిణీ

## గ్రామీణ కళలకు ప్రోత్సాహం

## అభినందనీయం: సర్పంచ్ కంతి మధు

**ఆలేరు, ఆగస్టు 10:** గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న డప్పుల కళను ప్రోత్సహించేందుకు శారాజిపేట గ్రామ సర్పంచ్ కంతి మధు ముందడుగు వేశారు. గ్రామంలోని సీనియర్ డప్పుల కళాకారుల బృందానికి సోమవారం ప్రత్యేకంగా దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కంతి మధు మాట్లాడుతూ తరతరాలుగా గ్రామీణ సంస్కృతిని కాపాడుతూ డప్పు కళను కొనసాగిస్తున్న కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కళాకారులకు అవసరమైన సహకారం అందిస్తూ వారి కళను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. దుస్తులు అందుకున్న డప్పుల కళాకారులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు కంతి ఐలయ్య, చిలుకు కిష్టయ్య, పుట్టల కిష్టయ్య, పుట్టల స్వామి, జెరిపోతుల మల్లేష్, నర్సింలు స్వామి, అనిల్, హరిబాబు, ప్రశాంత్, జానీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# మండల స్థాయి సమీక్షా సమావేశం

**యాలాల మండలం, ఆగస్టు,10**

యాలాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు మండల ప్రత్యేక అధికారి, ప్రత్యేక ఆహ్వానితులు స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు సామర్థ్య వృద్ధి (కెపాసిటీ బిల్డింగ్) కార్యక్రమాలపై మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో శ్రీనిజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నార్జిఎస్ నిధులు అమలు, వాటర్ మేనేజ్మెంట్, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామపంచాయతీల సొంత ఆదాయం, వీధి కుక్కల నియంత్రణ, వీధి విద్యుత్ దీపాలను నిర్వహణ,గ్రామపంచాయతీలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు,ఆయా శాఖల, మిగిలిన శాఖల పెండింగ్ అంశాలపై చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందన్నారు.

# యువ పార్లమెంట్ పథకానికి విశేష స్పందన

**న్యూఢిల్లీ, ఆగస్టు 10 :సమయం న్యూస్)**

జాతీయ యువ పార్లమెంట్ పథకం వెబ్ పోర్టల్‌ను NYPS 2.0 పేరుతో ఆధునీకరించినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024 సెప్టెంబర్ 11 నుంచి 2026 జూలై 21 వరకు ఈ పథకం ద్వారా మొత్తం 1,03,791 మంది విద్యార్థులు, పౌరులు భాగస్వాములయ్యారు.సంస్థాగత విభాగంలో 4,939 రిజిస్ట్రేషన్లు నమోదవగా, 1,611 యువ పార్లమెంట్ కార్యక్రమాల్లో 54,518 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్ విభాగంలో 982 మంది, వ్యక్తిగత విభాగంలో 48,291 మంది పాల్గొన్నారు. దేశంలోని అన్ని విద్యాసంస్థలు, గ్రూపులు, పౌరులకు NYPS 2.0 అందుబాటులో ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

# పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ప్రతిపాదన లేదు: కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 10 :** పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే ప్రతిపాదన ప్రస్తుతం పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నందున ప్రాజెక్టు టెక్నో–ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలని సూచిస్తూ ప్రాజెక్టు డీపీఆర్‌ను తిరిగి పంపినట్లు తెలిపింది. ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక సాయం విషయంలోనూ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది.



# చరిత్ర పొరల్లో దాగిన త్యాగధనుడు ఖుదీరాం

## స్వాతంత్ర్య సమరంలో తొలి బాంబు పేల్చిన ధీరుడు

### నేడు ఖుదీరాం బోస్ వర్ధంతి

భారత స్వాతంత్ర్య పోరాటం ఒకనాటిది, ఒక యేటిది, ఒక దశాబ్దపుది, శతాబ్దపుది కాదు. అంతకన్నా ఎక్కువ సమయం కొనసాగిన నేపద్యం ఉంది. అనేక సాయుధ పోరాటాలు, అహింసా యుత పద్ధతిలో జరిగిన ఉద్యమాలు భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగాలు. స్వాతంత్ర్య సమర యోధులు ఉద్యమాలు అనగానే 1857 విప్లవం మరిచిపోని మంగల్ పాండే, తాత్యా తోపే, బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన నిర్భయమైన రాణి లక్ష్మీబాయి, కిట్టూరుకు చెందిన రాణి చెన్నమ్మ, రాణి గైడిన్లు, చంద్ర శేఖర్ ఆజాద్, రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్‌గురు, గురు రామ్ సింగ్, పాల్ రామసామి, రాజేంద్ర ప్రసాద్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, వీర్ సావర్కర్ వంటి లెక్కలేనన్ని మంది నాయకులు, గొప్ప వ్యక్తిత్వాలన్నీ స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గ దర్శకులు. అలా దేశమాత దాస్య విముక్తి గావించడం కోసం ఎందరో వీరాధివీరులు, మహనీయులు తమ ప్రాణాలొడ్డి జీవితాలను అర్పించారు. అందులో చక్రవర్తులు, సాయుధ వీరులు, యువకులు... ఎందరో దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలనే త్యాగం చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో రక్తం మరిగే అంశాలు, రోమాలు నిక్క పొడుచుకునే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. స్వేచ్ఛా భారతావని కోసం అశువులు బాసిన ఎంతో మంది త్యాగధనుల చరిత్ర ఇప్పటి తరాల యువతకు ఎంతో ఉద్వేగ భరితంగా, మరెంతో ఉద్విగ్నంగా పరిణ మిస్తుంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పోరాట పటిమను, తెగువను, త్యాగాన్ని చూపించారు. ఎందరో తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. ఈ అసంఖ్యాక స్వాతంత్ర్యోద్యమాల కాలంలో ఎందరో అమరవీరులు ఉన్నారు. ఇందులో చరిత్ర చాలామందిని గ్రంథస్థం చేయలేక పోయింది. చేసినా కొందరిని చరిత్ర మరుగున పడేసింది. అలా చరిత్ర పొరల మాటున ఉన్న వారిలో యువ కిషోరం ఖుదీరాం ముఖ్యుడు. 18ఏళ్ల నూనూగు మీసాల యువ ఖుదీరాం బోస్ దేశం గర్వించదగ్గ త్యాగాన్ని మరిచినా, యాదృచ్ఛికంగా విస్మరించినా, దేశ స్వాతంత్ర్య చరిత్ర పరిపూర్ణం కానట్టే. ఖుదీరాం బోస్ భారతీయ స్వాతంత్ర్య సమర వీరులలో మొదటి తరానికి చెందిన అతిపిన్న వయస్కుడు. భారత దేశ వాసులను వేధించిన బ్రిటిష్ అధికారిపై బాంబు వేసిన మొదటి సాహస వీరుడు ఖుదీరాం. ఆ కారణంగా అతనిని ఉరితీసే నాటికి అతని వయసు కేవలం 18 సంవత్సరాల 7 నెలల 11 రోజులు మాత్రమే. ఖుదీరాం పశ్చిమ బెంగాల్, మిడ్నాపూర్ జిల్లా హబిబ్‌పూర్‌లో 1889 డిసెంబర్ 3న జన్మించాడు. చిన్ననాటి నుంచి స్వాతంత్ర్య కాంక్షతో రగిలి పోయేవాడు. మొదట్లో అఖ్రా అనే విప్లవ సంస్థలో చేరాడు. తన నాయకత్వ లక్షణాలు, సాహసో పేతమైన స్ఫూర్తితో ఆ సంస్థలో అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఆయన టీచర్ సత్యేంవూదనాథ్ బోస్, భగవద్గీతలను స్ఫూర్తిగా తీసుకున్నాడు. 1905లో బెంగాల్ విభజన అతడిలో బ్రిటిష్ ప్రభుత్వంపై మరింత కసి రేపింది. 16 ఏళ్ల వయసులోనే ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లను బాంబులతో పేల్చి వేశాడు. 1907 ఆగస్టు 26న ఒక కేసు విచారణ సందర్భంగా ఎంతోమంది యువకులు కోర్టు ముందర ఆసక్తిగా గుమికూడి ఉన్నారు. పరిస్థితి శాంతి యుతంగా ఉన్నప్పటికీ ఉన్నట్లుండి పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ వ్యవహారాన్ని అక్కడే ఉండి చూస్తున్న సుశీల్ కుమార్ సేన్ అనే 15 ఏళ్ళ యువకుడు భరించలేక ఆవేశంతో ఒక ఇంగ్లీష్ అధికారి ముక్కుమీద ఒక్కగుద్దు గుద్దాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్లారు. ఈ కేసు విచారణ చేసిన జడ్జి కింగ్స్ ఫోర్డ్ అనే అధికారి చిన్నవాడన్న దయ లేకుండా సుశీల్ కుమార్ కు15 కొరడా దెబ్బలను శిక్ష విధించాడు. సాహస వంతుడైన ఆ యువకుడు ప్రతి కొరడా దెబ్బకు వందేమాతరం అని నినదించాడు ఈ సంఘటన తరువాత స్వతంత్ర వీరులంతా కింగ్స్ ఫోర్డ్ కు గుణపాఠం చెప్పాలని నిర్ణయించు కున్నారు. మానవ రూపంలో ఉన్న మృగమైన ఫోర్డ్ లాంటి వారు ఉన్నంతవరకు దేశభక్త వీరులకు కష్టాలేనని భావించి అతనిని చంపడానికి నిశ్చయించు కున్నారు. 1908 ఏప్రిల్ మొదటి వారంలో జుగాంతర్ అనే విప్లవ సంస్థకి చెందిన విప్లవ వీరులు కొందరు కలకత్తలో ఒక ఇంటిలో రహస్యంగా సమావేశమై కింగ్స్ ఫోర్ట్ ను అంతం చెయ్యడానికి ఒక ప్రణాళిక రూపొందించి, అమలు చేయ సంకల్పించారు. ఆ సమావేశంలో అరవిందఘోష్ కూడా ఉన్నారు. ఖుదీరాం బోసునూ, ప్రఫుల్లచాకి అనే మరో నవ యువకుడినీ ఈ పనికై నియమించారు. 1908 ఏప్రిల్ 30 రాత్రివేళ వీరిద్దరూ ముజఫర్ పూర్ లోని యురోపియన్ క్లబ్ కు ఒకబాంబు, రివాల్వర్ తీసుకొని వెళ్లారు. కింగ్స్ ఫోర్డ్ వాహనం క్లబ్ బయటకు రాగానే దానిపైకి బాంబును విసిరేసి ఇద్దరు పరిగెత్తి వెళ్లి పోయారు. అయితే ఖుదీరాం, ప్రఫుల్లచాకిలు గమనించని విషయం... ఆ వాహనంలో కింగ్స్ ఫోర్డ్ లేక పోవడం.. అతని భార్య, కుమార్తెలు మాత్రమే ఉండడం. వారు బలి కావడం. ఒక రైల్వే స్టేషన్‌లో టీ తాగుతుండగా ఖుదీరాం బోస్‌ను పోలీసులు పట్టుకో గలిగారు. ఖుదీరాంను నిర్బంధించి రెండు నెలల పాటు విచారణ చేశారు. ముజఫర్ పూర్ బాంబు కేసులో ఫోర్డ్ భార్య, కుమార్తెల మరణానికి కారకుడైన ఖుదీరాంకు మరణశిక్ష విధించారు. 1908 ఆగష్టు 11న ఈ శిక్ష అమలు పరచ బడింది. పెదవులపై చిరునవ్వు చెదరకుండా ఖుదీరాం మృత్యువును ఆహ్వానించాడు. దేశం కోసం బలిదానం చేశాడు. బోస్ పట్టుబడిన రైల్వే స్టేషన్‌కు ఖుదీరాం బోస్ పూసా అని ఈ మధ్యే పేరు పెట్టారు. మాతృ భూమికోసం త్యాగం చెయ్యటం అందరికీ దొరికే అదృష్టం కాదు... అది నాకు లభించింది. అందుకు నేనెంతో గర్వ పడుతున్నాను. అయితే నేను అనుకున్నది సాధించలేదు. క్రూరుడైన కింగ్స్ ఫోర్డ్ ను శిక్షించలేక పోయాను. అదే నా బాధ... అంటూ 1908 ఆగష్టు 19 ఉదయం ఒక చేతిలో భగవద్గీత పట్టుకుని, ఉరికంబం దగ్గరికి వెళుతూ, ఉరితాడు బిగించమని, తలారి ఉరితాడు బిగిస్తుండగా 'వందేమాతరం' అని తుదిశ్వాస విడిచి అమరుడైన దేశ భక్తుడు ఖుదీరాం. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న వేళ...అలనాటి వీరుల, త్యాగధనుల జీవిత చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. త్యాగ మూర్తుల జీవిత కథలు, వారి జీవన పోరాటాలు, నేటి, రాబోయే తరాలకు జీవిత పాఠం నేర్ప గలగాలి. ఆ ప్రయత్నం ప్రతి దేశవాసీ చేయాలి. వారి త్యాగ పరంపరలను తర్వాతి తరానికి బోధిస్తేనే చైతన్యం కలిగి, వారిని నిరంతరం ఉత్తేజ పరచ డానికి గత చరిత్ర సాక్ష్యంగా నిలవాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు భాషకు శాస్త్రీయ వెలుగులు

- ద్రావిడ భాషల లోతులు తవ్విన భద్రిరాజు
- భాషాశాస్త్ర పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు
- తెలుగు క్రియా రూపాలపై అపూర్వ పరిశోధనలు
- ఉస్మానియాలో భాషాశాస్త్ర విభాగానికి తొలి ఆచార్యుడు
- విశ్వవేదికపై భారత భాషల గొప్పతనాన్ని చాటిన మేధావి
- నేడు భద్రిరాజు కృష్ణమూర్తి వర్ధంతి



తెలుగు భాషను ప్రేమించడం ఒక ఎత్తయితే.. ఆ భాష మూలాలను అన్వేషించడం మరో ఎత్తు. పదాల పుట్టుక నుంచి వాటి పరిణామం వరకు, క్రియా రూపాల నిర్మాణం నుంచి ద్రావిడ భాషల మధ్య బంధుత్వం వరకు శాస్త్రీయంగా పరిశోధించి ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత భాషావేత్త భద్రిరాజు కృష్ణమూర్తి. తెలుగు భాషాశాస్త్రాన్ని అంతర్జాతీయ పరిశోధనా వేదికలపై నిలబెట్టిన అరుదైన మేధావిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. 1928 జూన్ 19న ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన భద్రిరాజు కృష్ణమూర్తి చిన్ననాటి నుంచే అసాధారణ మేధస్సుతో గుర్తింపు పొందారు. ఉన్నత విద్యలో భాషలపై ఆసక్తిని పెంచుకున్న ఆయన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో సంస్కృతంలో ఉన్నత విద్యను అభ్యసించారు. అనంతరం అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, బర్కిలీలో భాషాశాస్త్రంలో పరిశోధన చేశారు. అక్కడ అంతర్జాతీయ స్థాయి భాషాశాస్త్రవేత్తల సాన్నిధ్యంలో ఆధునిక భాషా పరిశోధనా పద్ధతులను ఆకళింపు చేసుకున్నారు. ఆ అనుభవమే తర్వాత భారతీయ, ముఖ్యంగా ద్రావిడ భాషల అధ్యయనంలో ఆయనకు ప్రత్యేక దృక్పథాన్ని అందించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుడిగా పనిచేసిన భద్రిరాజు.. 1962లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర విభాగానికి తొలి ఆచార్యునిగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు రెండున్నర దశాబ్దాలపాటు అక్కడ సేవలందిస్తూ భాషాశాస్త్ర బోధన, పరిశోధనలకు బలమైన పునాదులు వేశారు. అప్పటివరకు సంప్రదాయ వ్యాకరణ అధ్యయనానికే ఎక్కువగా పరిమితమైన తెలుగు భాషా పరిశోధనను ఆధునిక భాషాశాస్త్ర పద్ధతుల వైపు మళ్లించడంలో ఆయన పాత్ర విశేషమైనది. భాషలో వచ్చే మార్పులను తప్పులుగా కాకుండా పరిణామంలో భాగంగా చూడాలని, మాండలికాలను తక్కువగా చూడకుండా వాటిలో దాగి ఉన్న భాషా చరిత్రను అధ్యయనం చేయాలని ఆయన పరిశోధనలు చాటిచెప్పాయి. ఆయన మార్గదర్శకత్వంలో తీర్చిదిద్దుకున్న అనేకమంది పరిశోధకులు దేశ విదేశాల్లో భాషాశాస్త్ర రంగంలో ప్రముఖ స్థానాలకు ఎదిగారు. తద్వారా ఒక వ్యక్తిగా పరిశోధనలు చేయడమే కాకుండా.. భాషాశాస్త్ర పరిశోధకుల తరాన్నే తయారుచేసిన ఆచార్యుడిగా భద్రిరాజు ప్రత్యేక స్థానం సంపాదించారు.

భద్రిరాజు కృష్ణమూర్తి పేరు చెప్పగానే ద్రావిడ భాషల తులనాత్మక అధ్యయనం గుర్తుకొస్తుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు వివిధ ద్రావిడ భాషల మధ్య ఉన్న సారూప్యతలు, శబ్ద పరిణామాలు, పద నిర్మాణం, క్రియా రూపాల్లో మార్పులను లోతుగా అధ్యయనం చేశారు. తెలుగు క్రియా రూపాల నిర్మాణంపై ఆయన చేసిన పరిశోధన అంతర్జాతీయ భాషాశాస్త్ర ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ద్రావిడ భాషల మూలాలను శాస్త్రీయ ఆధారాలతో విశ్లేషిస్తూ వాటి చారిత్రక పరిణామాన్ని వివరించేందుకు జీవితకాలం కృషి చేశారు. భాష అంటే కేవలం పదాలు, వాక్యాలు, వ్యాకరణ నియమాల సమాహారం మాత్రమే కాదన్నది ఆయన దృక్పథం. ఒక జాతి చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, సామాజిక పరిణామం తెలుసుకోవడానికి భాష అత్యంత విలువైన ఆధారమని ఆయన విశ్వసించారు. అందుకే భాషను చరిత్ర, సమాజం, సంస్కృతితో అనుసంధానిస్తూ పరిశోధనలు సాగించారు. తెలుగు, ద్రావిడ భాషాశాస్త్రంపై భద్రిరాజు రచించిన గ్రంథాలు ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులకు మార్గదర్శకాలుగా నిలిచాయి. తెలుగు క్రియా రూపాలపై ఆయన చేసిన పరిశోధనతో పాటు ద్రావిడ భాషల తులనాత్మక అధ్యయనం, ఆధునిక తెలుగు వ్యాకరణం, శబ్ద నిర్మాణం, భాషా పరిణామం వంటి అంశాలపై వెలువరించిన రచనలు విశేష గుర్తింపు పొందాయి. ద్రావిడ భాషలను విడివిడిగా పరిశీలించడంతో ఆగిపోకుండా వాటన్నింటినీ ఒకే భాషా కుటుంబానికి చెందిన శాఖలుగా తులనాత్మకంగా విశ్లేషించడం ఆయన పరిశోధనల్లో కనిపించే ప్రధాన ప్రత్యేకత. అందుకే ఆయన రచనలు నేటికీ భాషాశాస్త్ర విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు ప్రామాణిక ఆధారాలుగా నిలుస్తున్నాయి.

### విద్యా రంగానికీ విశిష్ట సేవ

భాషావేత్తగానే కాకుండా విద్యావేత్తగా, పరిపాలకుడిగానూ భద్రిరాజు తనదైన ముద్ర వేశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా పనిచేసి ఉన్నత విద్య, పరిశోధన రంగాల విస్తరణకు కృషి చేశారు. కేంద్ర భాషా సంస్థలోనూ కీలక బాధ్యతలు నిర్వహించి భారతీయ భాషల అధ్యయనానికి శాస్త్రీయ ప్రాతిపదికను బలోపేతం చేశారు. దేశంలోని వివిధ భాషలకు సంబంధించిన పరిశోధనలు, భాషా ప్రణాళిక, బోధనా విధానాలు, మాతృభాషల పరిరక్షణ వంటి అంశాలపై ఆయన అందించిన సూచనలు ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సాహిత్య, విద్యా, భాషా సంస్థలతో అనుబంధం కొనసాగిస్తూ భారతీయ భాషల అభివృద్ధికి తన మేధస్సును అంకితం చేశారు.

### పురస్కారాలకు మించిన పరిశోధనా కీర్తి

భాషాశాస్త్రం, విద్యారంగానికి అందించిన విశిష్ట సేవలకు భద్రిరాజు కృష్ణమూర్తికి అనేక జాతీయ, అంతర్జాతీయ గౌరవాలు లభించాయి. భారత ప్రభుత్వం ఆయనను పద్మ పురస్కారంతో సత్కరించింది. సాహిత్య, భాషా సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఆయన పరిశోధనా ప్రతిభను గుర్తించి అనేక గౌరవాలను అందించాయి. అయితే ఆయనకు లభించిన పురస్కారాలకన్నా.. తెలుగు, ద్రావిడ భాషలపై ఆయన నిర్మించిన అపారమైన పరిశోధనా సంపదే ఆయనకు నిజమైన స్మారకం.

### భాష ఉన్నంతకాలం నిలిచే పేరు

2012 ఆగస్టు 11న భద్రిరాజు కృష్ణమూర్తి కన్నుమూశారు. భౌతికంగా ఆయన దూరమైనా భాషాశాస్త్ర రంగంలో ఆయన వెలిగించిన జ్ఞానజ్యోతి మాత్రం నేటికీ ప్రకాశిస్తూనే ఉంది. తెలుగు భాష మూలాలను వెతికే ప్రతి పరిశోధకుడికీ, ద్రావిడ భాషల మధ్య బంధాన్ని అధ్యయనం చేసే ప్రతి విద్యార్థికీ ఆయన రచనలు దిక్సూచిగా నిలుస్తున్నాయి. ఒక భాషను ప్రేమించడమంటే దాన్ని మాట్లాడటం మాత్రమే కాదు.. దాని మూలాలను తెలుసుకోవడం, చరిత్రను వెలికితీయడం, భవిష్యత్ తరాలకు దాని వైభవాన్ని అందించడం కూడా. ఆ బాధ్యతను జీవితకాల తపస్సుగా స్వీకరించిన భాషా శాస్త్ర తపస్వి భద్రిరాజు కృష్ణమూర్తి. తెలుగు పలుకు ఉన్నంతకాలం.. ద్రావిడ భాషలపై పరిశోధన సాగినంతకాలం.. భద్రిరాజు కృష్ణమూర్తి పేరు భాషాశాస్త్ర చరిత్రలో అజరామరమే.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# త్యాగానికి ప్రతిరూపం బత్తిని మొగిలయ్య

## నేడు బత్తిని మొగిలయ్య గౌడ్ అమరుడైన దినం



బత్తిని మొగిలయ్య గౌడ్ ఓరుగల్లుకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు. రజాకార్లను ఎదిరించి పోరాడి అమరుడైన వీరుడు. బత్తిని మొగిలయ్య గౌడ్ వరంగల్ తూర్పు కోట నివాసి. తల్లిదండ్రులు బత్తిని చెన్నమ్మ, మల్లయ్యలు, అన్న బత్తిని రామస్వామి గౌడ్... చెన్నమ్మ, మల్లయ్య దంపతుల ఐదవ సంతానంగా ఆ కాలపు దీరుడిగా ఖిల్లా ఓరుగల్లులో పాఠాలు నేర్చుకున్నాడు. మొగిలయ్య కోట బడిలో 4వ తరగతి వరకు చదివాడు. బత్తిని మొగిలయ్య గౌడ్, బత్తిని రామస్వామి గౌడ్ లిద్దరు ఆర్యసమాజ్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవారు. అన్న రామస్వామి, భూపతి కృష్ణమూర్తి, ఇతర కాంగ్రెస్ వాదులతో కలిసి కాంగ్రెస్, ఆర్యసమాజ్ సమావేశాలకు వెళ్లేవాడు, అన్నదమ్ములు అన్ని విషయాలలో తోడుగా ఉంటూ, గౌడ కుల వృత్తి అయిన తాళ్లు ఎక్కుతూ వ్యవసాయం చేసేవారు. గౌడ్ ల పరిస్థితి చాల దుర్భరంగా ఉండే నాటి పరిస్థితులలో, నిజాం ప్రభువు కల్లు మీద, తాడిచెట్ల మీద పన్నులు వసూలు చేయడాన్ని, పన్నులు కట్టని గౌడులకు విధించే శిక్షలను ఆయన జీర్ణించుకునే వాడు కాదు. నిజాం పోలీసులన్నా, రజాకార్లన్నా ఆయనకు తీవ్ర వ్యతిరేకత ఉండేది. స్వతంత్ర అభిలాషను విస్తృత పరిచే దిశగా పన్నెండవ జాతీయాంధ్ర మహాసభలు 1946లో వరంగల్ లోని మడికొండలో జరిగాయి. రహస్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు జాతీయ జెండా ఎగుర వేయాలనేది సభల ఉద్దేశం. నిజాం రాష్ట్రంలో త్రివర్ణ పతాకావిష్కరణ అధికారికంగా నిషేధించ బడింది. జెండా ఎత్తడం అంటే దెబ్బలకు, జైలుశిక్షకు, మరణానికి వెరవకుండా చేసే సాహసోపేత కార్యక్రమమే.

వరంగల్ కోటలో దేశభక్తి ప్రేరితులు అయిన యువకులు బత్తిని రామస్వామి గౌడ్, బత్తిని మొగిలయ్య గౌడ్, సంగరబోయిన కనకయ్య, సంగరబోయిన మల్లయ్య, నరిమెట్ల రామస్వామి, వడ్లకొండ ముత్తయ్య, పోశాల కనుకయ్య, ఆరెల్లి బుచ్చయ్య తదితరులు జెండా వందన కార్యక్రమాలను కోట ప్రజల సమక్షంలో నిర్వహించే వారు. స్టేట్ కాంగ్రెస్, కార్యకర్తలందరికి రహస్యంగా నైనా జెండా ఎగుర వేయాలనే ఆదేశాలిచ్చింది. స్టేట్ కాంగ్రెస్ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం వరంగల్ లోని చైతన్యం కలిగిన యువకులు, కాంగ్రెస్ నాయకులు, ఆర్యసమాజ్ కార్యకర్తలు వరంగల్ కోటలో జెండా ఎగుర వేసే వారు. 11 ఆగస్టు 1946 ఆదివారం రోజు ఉదయం7.30 గంటలకు వరంగల్ తూర్పు కోటలో జెండా ఎగుర వేయడానికి వరంగల్, హన్మకొండ నుండి వచ్చి, కాంగ్రెస్ నాయకులు యం.యస్. రాజలింగం, టి.హయగ్రీవాచారి, భూపతి కృష్ణమూర్తి, మదూరి రాజలింగం, బత్తిని సోదరులు కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హయగ్రీవాచారి జెండాను ఎగురవేయగా, త్రివర్ణ పతాకం వందనం చేసి పిల్లలు పెద్దలంతా జై కొట్టారు. అప్పుడే సుమారు రెండు వందల మంది రజాకార్లు, వారి అనుయాయులు మారణా యుధాలతో ఖాసీం షరీఫ్ అనే రజాకార్ నాయకుని అధ్వర్యంలో, జెండా ఎత్తిన నాయకులను చంపడానికి నిజాం అనుకూల నినాదాలను చేస్తూ జెండా ఎత్తిన ప్రాంతానికి చేరుకున్నారు. ఎగిరిన జెండాను చూసి, కోపం కట్టలు తెంచుకున్న రజాకార్లు, జెండాను దించి తొక్కి, తగలబెట్టి, అంతా కలిసి బత్తిని రామస్వామి గౌడ్ ఇంటి వైపు అరుస్తూ, తిడుతూ వెళ్ళారు. జెండా ఎత్తిన ప్రధాన నాయకులైన హయగ్రీవ చారి, భూపతి కృష్ణమూర్తి, పంచాయతి హవల్దారు కె.సమ్మయ్య, వెంకట్రాం నర్సయ్య, యం.యస్.రాజలింగం వీరందరూ బత్తిని రామస్వామి ఇంట్లో కూడి, భవిష్యత్తు జెండా వందన కాంగ్రెస్ కార్యక్రమాల గురించి చర్చించు కుంటున్నారు. ఆ ఇంటి చుట్టూ మోహరించిన రజాకార్లు ఇంట్లోకి వెళ్ళి వాళ్లను చంపే ప్రయత్నం చేసారు. లోపల ఉన్న భూపతి కృష్ణమూర్తి కాంపౌండ్ కు గొళ్లెం పెట్టగా, రజాకార్లు రాళ్ళతో ఇంట్లోని వాళ్ళ మీద దాడి చేశారు. తలుపులు బద్దలు కొట్టి, జెండా ఎత్తిన నాయకులందరిని చంపాలని చూసారు. జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్న మొగిలయ్య, అనంతరం తాళ్లెక్కడానికి తాటి వనానికి వెళ్లాడు. మొగిలయ్య భార్య లచ్చవ్వ 15 రోజుల బాలింత, పురిటి బిడ్డతో మంచంపై ఉంది. మొగిలయ్య భార్య లచ్చవ్వ, తల్లి చెన్నమ్మ ఈ దాడితో భీతిల్లి పోయారు. శనిగారం పుల్లయ్య అనే ఆర్యసమాజ్ కార్యకర్త తాటి వనంలో ఉన్న మొగిలయ్యను కలిసి రజాకార్ల దాడి గురించి చెప్పాడు. దాడి గురించి విన్న మొగిలయ్య ఒక్క క్షణం నిశ్చేష్టుడై, మరుక్షణం తన ఇంటివైపు పరుగు తీసాడు. ఆ ఇంట్లో ఉన్న వాళ్లంతా వందల మంది రజాకార్ల చేతుల్లో చనిపోయేట్టుగా ఉందని భావించి, తన ఇంటి వెనుక దర్వాజా నుండి రజాకార్ల కంటబడకుండ ఇంట్లోకి వెళ్ళి, మెరుపు వేగంతో ఇంటి సూరు లోని పదునైన కత్తిని తీసి, మెరుపులా రజాకార్ల మూకపై పడి యుద్ధం మొదలు పెట్టాడు. ఈ దాడికి నాయకత్వం వహించిన ఖాసీం షరీఫ్ తో సహా, రజాకార్లంతా చీమల పుట్ట చెదిరి నట్లుగా చెదిరిపోయారు. రజాకార్లు తిరిగి మొగిలయ్య పై మూకుమ్మడిగా రెండవ మారు దాడికి పాల్పడ్డారు. రెండవసారీ మొగిలయ్య వారిని తరిమివేశాడు, కానీ మూడవసారి దాడిలో ఖాసీం షరీఫ్ బల్లెంతో మొగిలయ్య వైపు వస్తున్నప్పుడు, మొగిలయ్య తన శత్రువును నరకడానికి తన ఎత్తిన కత్తిని తన ఇంటి ముందు గల పందిరి గుంజల మధ్య చిక్కుకుంది. ఇదే అదనుగా భావించిన షరీఫ్ తన బల్లెంతో మొగిలయ్య గుండెల మీద పొడిచాడు. అలా రజాకార్ల మూకుమ్మడి దాడిలో మొగిలయ్య అమరుడైనాడు. మొగిలయ్యను చంపిన ఖాసీం షరీఫ్ ని అతని అనుయాయులు, తమ భుజాలపై మోస్తూ ఇప్పటి వరంగల్ చౌరస్తాకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అప్పటి వరంగల్ తాలుకా దార్ (కలెక్టర్) అబ్దుల్ మొహిత్ మిల్ ఎదురేగి, హంతకుడైన ఖాసీం షరీఫ్ కు పూలమాల వేసి ఆలింగనం చేసుకున్నాడు.జెండా ఎత్తిన నాయకులకు ప్రాణభిక్ష పెట్టి, త్యాగనిరతి కి ప్రతిరూపంగా నిలిచి, 25 సంవత్సరాల వయస్సులోనే అమరుడైన నిష్కళంక దేశభక్తుడు బత్తిని మొగిలయ్య స్మృతి చిరస్మరణీయంగా మిగిలి పోవాలని వరంగల్ నడిబొడ్డున గల జె.పి.ఎన్ రోడ్ లో 1954 లో మొగిలయ్య స్మారక భవనాన్ని ప్రజలు ఏర్పాటు చేసారు.



# మీ గెలుపు దేశానికే గర్వకారణం

- మన కీర్తిపతాకను రెపరెపలాడించారు
- కామన్వెల్త్ పతకవీరులకు ప్రధాని మోదీ అభినందనలు
- భారత్ మ్యాప్‌పై స్పందించిన లవ్లీనాకు ప్రత్యేక ప్రశంస
- క్రీడాకారులతో ముచ్చటించిన ప్రధాని



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** అంతర్జాతీయ క్రీడా వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిపతాకను రెపరెపలాడించిన భారత క్రీడాకారులను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. "మీ గెలుపు మీ ఒక్కరిదే కాదు.. యావత్ దేశానికీ గర్వకారణం" అంటూ ప్రశంసించారు. కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన భారత అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిశారు. వారితో మోదీ సరదాగా ముచ్చటిస్తూ లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా భారత బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్‌ను ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. గ్లాస్గోలోని ఓ రెస్టారెంట్‌లో భారత్ చిత్రపటం అసంపూర్తిగా ఉండటాన్ని గుర్తించి ఆమె అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. "అక్కడ ఏం జరిగింది?" అంటూ మోదీ అడగగా లవ్లీనా వివరించారు. కామన్వెల్త్ క్రీడల్లో మంచి ప్రదర్శన చేసిన ఆనందంలో చివరి రోజు కొందరు భారత అథ్లెట్లు రెస్టారెంట్‌కు వెళ్లారని, అక్కడ హ్యాండ్ టవల్స్‌పై ముద్రించిన భారత్ చిత్రపటం సరిగా లేదని గుర్తించినట్లు చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్‌కు సంబంధించిన భూభాగాలను సరిగా చూపించకపోవడంతో రెస్టారెంట్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం వారు తప్పును సరిచేస్తామని చెప్పడంతోపాటు క్షమాపణలు తెలిపారని వివరించారు. విజయోత్సాహంలో ఉన్న సమయంలోనూ దేశ చిత్రపటానికి సంబంధించిన అంశాన్ని గుర్తించి స్పందించడం అభినందనీయమని మోదీ కొనియాడారు. "ఆ వీడియో సాధారణమైనది కాదు. దేశ ప్రజలు దీన్ని చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని ప్రశంసించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ తనకు గతంలో పాకిస్థాన్ బాక్సర్‌తో ఎదురైన ఆసక్తికర అనుభవాన్ని ప్రధానితో పంచుకున్నారు. 2015 మిలిటరీ క్రీడల్లో తన తొలి పోరు పాకిస్థాన్ బాక్సర్‌తో జరిగిందని చెప్పారు. ఆ పోరులో తాను విజయం సాధించిన అనంతరం పాక్ బాక్సర్ తనతో సరదాగా మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. తన పేరు నరేందర్ కావడం, తన కోచ్ పేరు నరేందర్ రాణా కావడం, అప్పటికే భారత ప్రధానిగా నరేంద్ర మోదీ ఉండటాన్ని ప్రస్తావిస్తూ.. "ఇకపై నరేందర్ అనే పేరు అంటేనే నాకు ఇష్టం ఉండదు" అని పాక్ బాక్సర్ అన్నట్లు బేర్వాల్ వివరించారు. ఈ ఆసక్తికర సంఘటన విని ప్రధాని మోదీ నవ్వేశారు.

# రాహుల్ కెప్టెన్ కాకపోవడమే మంచిది!




- సారథ్య భారం లేకుంటే అసలు ఆట బయటకొస్తుంది
- ఏటా 500-600 పరుగులు చేసే సత్తా ఉంది
- ఒంటిచేత్తో రెండు, మూడు మ్యాచ్‌లు గెలిపించగలడు
- మాజీ క్రికెటర్ వసీం జాఫర్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు లేకపోవడమే మంచిదని మాజీ క్రికెటర్, పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ కోచ్ వసీం జాఫర్ అభిప్రాయపడ్డారు. సారథ్య భారం లేకుండా ఆడితే రాహుల్‌లోని అసలైన బ్యాటర్ బయటకు వస్తాడని పేర్కొన్నారు. స్వేచ్ఛగా ఆడే అవకాశం కల్పిస్తే ఐపీఎల్‌లో ప్రతి సీజన్‌లో 500 నుంచి 600 పరుగులు చేసే సామర్థ్యం అతడికి ఉందని ప్రశంసించారు. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరించిన సమయంలో జాఫర్ ఆ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. తాజాగా ఓ క్రికెట్ చర్చా కార్యక్రమంలో రాహుల్ ఆటతీరు, నాయకత్వంపై జాఫర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

### సారథ్యంతో అదనపు ఒత్తిడి

రాహుల్ అత్యంత నమ్మకమైన బ్యాటర్ అని జాఫర్ కొనియాడారు. తనదైన రోజున ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సత్తా అతడి సొంతమన్నారు. ఒక ఐపీఎల్ సీజన్‌లో రెండు, మూడు మ్యాచ్‌లను తన బ్యాటింగ్‌తోనే గెలిపించగలడని చెప్పారు. అయితే కెప్టెన్సీ బాధ్యతలు అతడి సహజమైన ఆటతీరుపై అదనపు ఒత్తిడిని పెంచుతాయని అభిప్రాయపడ్డారు. "రాహుల్‌కు కెప్టెన్సీ లేకపోవడమే మంచిది. ఎలాంటి అదనపు భారం లేకుండా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తే అతడు మరింత ప్రమాదకరమైన ఆటగాడిగా మారతాడు. అతడి నుంచి ప్రతి సీజన్‌లో భారీగా పరుగులు ఆశించవచ్చు" అని జాఫర్ పేర్కొన్నారు. పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్‌జెయింట్స్ జట్లకు గతంలో రాహుల్ నాయకత్వం వహించారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారిన తర్వాత కెప్టెన్సీకి దూరంగా ఉండటం అతడి బ్యాటింగ్‌కు మేలు చేస్తుందని జాఫర్ అభిప్రాయపడ్డారు.

### లంక సిరీస్‌లో రాహుల్ కీలకం

భారత్-శ్రీలంక మధ్య గాల్, కొలంబో వేదికలుగా జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌లో కేఎల్ రాహుల్ పాత్ర కీలకంగా మారనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగమైన ఈ సిరీస్‌లో అనుభవజ్ఞుడైన బ్యాటర్‌గా జట్టు బ్యాటింగ్ విభాగానికి బలాన్నివ్వాల్సిన బాధ్యత అతడిపై ఉంది. ప్రాక్టీస్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన రాహుల్ 40 పరుగులతో మంచి లయలో కనిపించాడు. కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడుతూ శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో భారీ పరుగులు సాధించాలని అభిమానులు

# టీమిండియా 'రహస్యాలు' ఐపీఎల్‌లోనే తెలిసిపోయాయి!

- భారత ఆటగాళ్ల వ్యూహాలను దగ్గరుండి గమనించా: హెన్రిక్స్
- సచిన్ నుంచి కోహ్లీ వరకు దిగ్గజాలతో మెలిగే అవకాశం
- అంతర్జాతీయ క్రికెట్‌లో ఆ అనుభవం ఎంతో ఉపయోగపడింది
- కష్టకాలంలో కావ్య మారన్ అండగా నిలిచారన్న ఆసీస్ ఆల్‌రౌండర్






**సిడ్నీ, ఆగస్టు 10:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడటం తన క్రికెట్ కెరీర్‌కు కొత్త దిశ చూపిందని ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మోయిసెస్ హెన్రిక్స్ పేర్కొన్నారు. భారత క్రికెటర్లతో కలిసి ఆడటం ద్వారా వారి మానసిక దృక్పథం, ఆటతీరు, మ్యాచ్ వ్యూహాలను దగ్గరుండి తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. ఆ అనుభవం అంతర్జాతీయ క్రికెట్‌లో తనకు ఎంతగానో ఉపయోగపడిందని వెల్లడించారు. ఐపీఎల్‌లో వివిధ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించిన సమయంలో సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, వీరేంద్ర సెహ్వాగ్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా వంటి భారత దిగ్గజాలతో మైదానంలోనూ, వెలుపలా మెలిగే అవకాశం లభించిందని హెన్రిక్స్ తెలిపారు. భారత ఆటగాళ్లు మ్యాచ్‌కు ఎలా సిద్ధమవుతారు? ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటారు? ప్రత్యర్థులపై ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తారు? వంటి అనేక అంశాలను దగ్గరుండి పరిశీలించగలిగానన్నారు. వారి ఆటలోని సూక్ష్మ అంశాలు, వ్యూహాలను తెలుసుకోవడం తనకు ఎంతో విలువైన అనుభవమని పేర్కొన్నారు.

### కష్టకాలంలో కావ్య అండ

ఆస్ట్రేలియా జట్టులో స్థానం కోసం పోరాడుతున్న సమయంలో తాను తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు హెన్రిక్స్ వెల్లడించారు. ఆ సమయంలో తనకు అవసరమైన మద్దతు లభించక ఇబ్బంది పడ్డానని పేర్కొన్నారు. అలాంటి క్లిష్ట సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన కావ్య మారన్ తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని చెప్పారు. ఆమె ఇచ్చిన భరోసాను జీవితాంతం మరచిపోలేనని కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుంచి 2017 మధ్య సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన హెన్రిక్స్.. 2016లో జట్టు ఐపీఎల్ చాంపియన్‌గా నిలవడంలో తనవంతు పాత్ర పోషించారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో కీలక ప్రదర్శనలు చేసి జట్టు విజయాల్లో భాగస్వామిగా నిలిచారు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన హెన్రిక్స్ ప్రస్తుతం పోర్చుగల్ జాతీయ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.




# గోల్ కొట్టిన ఆనందంలో జంప్ టన్నెల్‌లో పడ్డ ప్లేయర్

### గాయంతో మ్యాచ్‌కు దూరం.. చివరకు గోల్ కూడా రద్దు

### సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో

**రియో, ఆగస్టు 10:** గోల్ కొట్టిన ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. సంబరాల్లో గంతేసిన ఆటగాడు ఏకంగా స్టేడియం టన్నెల్‌లో పడిపోయాడు. గాయపడి మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. చివరకు తాను కొట్టిన గోల్ కూడా రద్దయింది. బ్రెజిల్‌లో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో చోటుచేసుకున్న ఈ గమ్మత్తైన ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొరిటిబా క్లబ్ డిఫెండర్ జేసీ మరన్హో.. చాపెకోయెన్సె జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి గోల్‌పోస్టులోకి బంతిని పంపించాడు. గోల్ సాధించానన్న ఆనందంతో ప్రేక్షకుల వైపు పరుగులు తీశాడు. అక్కడ ఉన్న ప్రకటన బోర్డును ఉత్సాహంగా దూకాడు. అయితే బోర్డు వెనుక స్టేడియం టన్నెల్ ఉందన్న విషయాన్ని గమనించకపోవడంతో నేరుగా అందులో పడిపోయాడు. టన్నెల్‌లో పడిన మరన్హో కొద్దిసేపటి తర్వాత తిరిగి బయటకు వచ్చాడు. మడమకు గాయమైనప్పటికీ గోల్ సాధించానన్న ఆనందంతో సంబరాలు కొనసాగించాడు. అయితే గాయం తీవ్రత కారణంగా కొద్దిసేపటికే మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

### చివరకు గోల్ కూడా లేదు!

ఇంత జరిగిన తర్వాత మరన్హోకు మరో షాక్ తగిలింది. వీడియో సహాయ సమీక్షలో అతడు గోల్ చేసే సమయంలో ఆఫ్‌సైడ్‌లో ఉన్నట్లు తేలడంతో గోల్‌ను రద్దు చేశారు. దీంతో గోల్ దక్కలేదు.. సంబరాల్లో గాయమై మ్యాచ్‌నూ వీడాల్సి వచ్చింది. అయితే మరన్హో ప్రాతినిధ్యం వహించిన కొరిటిబా జట్టు చివరకు మ్యాచ్‌లో విజయం సాధించడం అతడికి ఊరటనిచ్చింది. ఇదే స్టేడియంలో గతంలోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. 2014లో కామెరూన్ ఆటగాడు జోయెల్ కూడా గోల్ సంబరాల్లో ప్రకటన బోర్డు వద్ద గంతేసి టన్నెల్‌లో పడిపోయాడు.




# అష్మిత అద్భుతం

### కొరియా మాస్టర్స్ టైటిల్ కైవసం

### ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా రికార్డు

**ఆసన్ (దక్షిణ కొరియా), ఆగస్టు 10:** కొరియా గడ్డపై భారత యువ షట్లర్ అష్మిత చాలిహా చరిత్ర సృష్టించింది. బీడబ్ల్యూఎఫ్ కొరియా మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. తద్వారా కొరియా మాస్టర్స్ టైటిల్ గెలిచిన తొలి భారత షట్లర్‌గా రికార్డు నెలకొల్పింది. అంతేకాదు.. తన కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిల్‌ను ముద్దాడింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో అష్మిత 14-21, 21-14, 21-14తో నాలుగో సీడ్ హాన్ జియాన్ జి (చైనా)పై సంచలన విజయం సాధించింది. 53 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్‌ను కోల్పోయిన అష్మిత.. ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత వం-సగా రెండు గేమ్‌లను సొంతం చేసుకుని ప్రత్యర్థిని మట్టికరిపించింది. తొలి గేమ్‌ను 14-21తో కోల్పోయిన అష్మిత రెండో గేమ్‌లో ఆటతీరును పూర్తిగా మార్చేసింది. ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగుతూ 21-14తో గేమ్‌ను సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే జోరు కొనసాగించి 21-14తో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో అష్మిత ప్రయాణం ఆద్యంతం ఆకట్టుకుంది. క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ హినా అకెచి (జపాన్)కి షాకిచ్చిన ఆమె.. సెమీఫైనల్లో భారత్‌కే చెందిన రక్షితను ఓడించి తొలిసారి బీడబ్ల్యూఎఫ్ ఫైనల్‌కు చేరింది. తుదిపోరులోనూ ఒత్తిడిని అధిగమించి చాంపియన్‌గా నిలిచింది. అష్మిత విజయానికి మరో ప్రత్యేకత ఉంది. 2024లో కొరియా ఓపెన్ సందర్భంగా ఆమె కుడి మోకాలికి గాయమైంది. అనంతరం శస్త్రచికిత్స చేయించుకుని కొంతకాలం ఆటకు దూరమైంది. రెండేళ్ల తర్వాత అదే కొరియా గడ్డపై తిరిగి టైటిల్ సాధించడం విశేషం. ఇక ఈ నెల 1న ముగిసిన తైపీ ఓపెన్‌లో భారత షట్లర్ తన్వి శర్మ విజేతగా నిలవగా.. వారం రోజుల వ్యవధిలోనే అష్మిత మరో టైటిల్‌ను అందించింది. దీంతో భారత్ ఖాతాలో వరుసగా రెండు బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిళ్లు చేరాయి. ఈ ఏడాది దేవికా సిహాగ్, పీవీ సింధు, తన్వి శర్మ, అష్మిత చాలిహా బీడబ్ల్యూఎఫ్ టైటిళ్లు సాధించడం విశేషం. భారత్ తరఫున బీడబ్ల్యూఎఫ్ టూర్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన షట్లర్ల జాబితాలో పీవీ సింధు, సైనా నెహ్వాల్, తన్వి శర్మ, దేవికా సిహాగ్ సరసన అష్మిత చేరింది.




# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల

నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

# వారణాసి హన్మంతుడిగా రామ్‌చరణ్?



దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన మల్టీస్టారర్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ చిత్రంగా రూపొందుతున్న 'వారణాసి'లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ స్థాయిలో అడ్వెంచర్, యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పలు కాలాలను, విభిన్న ప్రపంచాలను కలిపి రాజమౌళి సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. 'వారణాసి' కథలో త్రేతాయుగానికి సంబంధించిన కీలకమైన ఎపిసోడ్ ఉంటుందని, ఆ భాగంలో మహేశ్‌బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. శ్రీరాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపించే ఎపిసోడ్‌లో హనుమంతుడిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మొదట హనుమంతుడి పాత్ర కోసం మరో నటుడి పేరు వినిపించినప్పటికీ, ఈ పాత్రకు కావాల్సిన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ దృష్ట్యా రామ్ చరణ్ అయితే మరింత ప్రభావవంతంగా ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. 'ఆర్ఆర్ఆర్'లో అల్లూరి సీతారామరాజుగా చరణ్‌ను అద్భుతంగా ఆవిష్కరించిన రాజమౌళి.. క్లైమాక్స్‌లో ఆయనను రాముడి రూపంలో చూపించిన విధానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు అదే దర్శకుడు 'వారణాసి'లో చరణ్‌ను హనుమంతుడి పాత్రలో చూపిస్తే అది సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా మారుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# ఇంద్రపుత్రగా కిరణ్ అబ్బవరం



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బడ్జెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌ను పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు.ఈ సినిమా కేవలం ఒక కథతో ముగిసిపోయే ప్రాజెక్ట్ కాదని తెలుస్తోంది. మేకర్స్ రూపొందించనున్న మైథలాజికల్ యూనివర్స్‌లో 'ఇంద్రపుత్ర' మొదటి అధ్యాయంగా ఉండబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా తర్వాత ఇదే ప్రపంచంలో మరిన్ని కథలు, పాత్రలతో సినిమాలు తెరకెక్కించే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్‌తో కలిసి నిర్మాణ బృందం భారీ స్థాయిలో రూపొందిస్తోంది. కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం కథ, ప్రీ-ప్రొడక్షన్ పనులను పూర్తి చేసే దిశగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది.

# మహేశ్ ఏఐ వీడియో షేర్ చేసి వంగా

## కృష్ణ డైలాగ్ మహేశ్ పలికినట్లుగా క్రియేషన్

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ కూడా ఫిదా అయ్యారు. దివంగత లెజండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'డెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.





# 'టాక్సిక్'తో నా సత్తా చూపించా

## 'నీ వల్ల కాదు' అన్నవారికి సినిమా పూర్తిచేసి సమాధానం చెప్పా: గీతూ

'టాక్సిక్' సినిమా ప్రారంభించినప్పుడు "నీ వల్ల కాదు" అంటూ చాలామంది తనను నిరుత్సాహపరిచారని, ఇప్పుడు చిత్రాన్ని విజయవంతంగా పూర్తి చేసి తన సత్తా ఏమిటో చూపించానని దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ భావోద్వేగానికి గురయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఇంత భారీ చిత్రానికి అవకాశం ఇచ్చిన హీరో యశ్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పారు. యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదల సమీపిస్తున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ప్రచార వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతూ తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. 'టాక్సిక్' ప్రారంభించిన సమయంలో తన సామర్థ్యంపై పలువురు సందేహాలు వ్యక్తం చేశారని తెలిపారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఇలాంటి చిత్రాన్ని తాను పూర్తి చేయలేనని వ్యాఖ్యానించినవారూ ఉన్నారని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగానని, చివరకు అనుకున్న విధంగా సినిమాను పూర్తి చేయగలిగానని చెప్పారు. తనపై పూర్తి నమ్మకం ఉంచి 'టాక్సిక్'కు అంగీకరించిన యశ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన సామర్థ్యాన్ని నమ్మి వెన్నుదన్నుగా నిలిచినందుకు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని గీతూ పేర్కొన్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన 'టాక్సిక్'తో యశ్ మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో సినిమాపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా విడుదలైన ప్రచార చిత్రంతో ఆ అంచనాలు మరింత పెరిగాయి.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com